
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024 | 5



నేడు పిఠాపురం, రాజానగరంలో పవన్ పర్యటన 7



జగనన్నా నీ భాషలో నా అంటే ఏంటన్నా.. వదిలేయడమా.. పట్టుకోవడమా.. లేదంటే నమ్మించి మోసం చేయడమా.. ఇదీ ఒక బీసీ నాయకుడి ప్రశ్న.. మీకెందుకా డౌటు అంటే..!? నా బాణం అంటూ గత ఎన్నికల్లో చెల్లెలు షర్మిలను ఊరూవాడా తిప్పారు.. చివరకు ఏం జరిగింది.. అధికారం వచ్చిన తరువాత ఆమె ఎవరో కూడా మర్చిపోయారు.. చివరికి సీఎం జగన్ సొంత చెల్లెలు కాంగ్రెస్ పంచన చేరింది.. 2024 ఎన్నికల వేళ... జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. నా బీసీలు.. నా ఎస్సీలు.. నా ఎస్టీలంటూ ఊదరగొడుతున్నారు.. ఒకసారి బీసీల సంగతే తీసుకుంటే.. ఈ ఐదేళ్లలో బీసీలకు చేసిందేంటి.. ఏమీలేదు.. రిజర్వేషన్లు కుదించేశారు.. ఆదరణ పథకం అటకెక్కించేశారు.. బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణమూ ఆపేశారు.. కార్పొరేషన్లు పెట్టారు.. ఒక్క రూపాయి విడుదల చేయకుండానే పాలన ముగించేశారు.. మాట్లాడితే నా బీసీలనే జగన్.. ఐదేళ్లూ వెనుకబడిన తరగతులకు చేసిందేంటి.. చెల్లి షర్మిలను పక్కనబెట్టేసినట్టే.. బీసీలను వెనుకబడేశారు.. ఎన్నికల వేళ నా బీసీలంటూ మళ్లీ ఓటు రాజకీయం ఆరంభించారు.. బీసీల్లారా తస్మాత్ జాగ్రత్త!? ఈ సారైనా మేల్కొండి.. అంటూ బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి.

- మరిన్ని వివరాలు 6వ పేజీలో..

ఐదేళ్లూ..వెనకబడే!

నా బీసీలంటూనే... జగన్ మోసం



ఐదేళ్లుగా ఇంతేగా : పిఠాపురంలో ఖాళీగా బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలం



వీరవరంలో చేనేత

పిఠాపురం, ఏప్రిల్ 19 : నా.. బీసీలు అంటూ చిలక పలుకులు పలుకుతున్న జగన్ తన ఐదేళ్ల పాలనలో వారిని నమ్మించి నిలువునా మోసం చేశారు. అండగా నిలబడతానని చెప్పి అణగదొక్కేశారు. చేతివృత్తుల వారికి చేయూతను ఇచ్చే ఆదరణ పథకాన్ని అర్ధంతరంగా నిలిపివేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన ఉపకరణాలు తుప్పు పట్టించేశారు. బీసీ భవన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపును రద్దు చేశారు. ఆయా స్థలాలు కబ్జా చేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. యువత ఉపాధికి అందించే సబ్సిడీ రుణాలు అటకెక్కించారు. బీసీల్లో ప్రతి కులానికి కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. బీసీల సంక్షేమ పథకాలన్నీ రద్దు బాటలోనే నడిచాయి. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు అడుగడుగునా అన్యాయం జరిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 30కిపైగా పథకాలను జగన్ సర్కారు రద్దుల పద్దులోకి చేర్చింది. బీసీలపై దాడులు పెరిగిపోతున్నా కనీస చర్యలు లేవు. ఒక్క కాకినాడ జిల్లాలోనే చూస్తే 7.40 లక్షల మందికి పైగా బీసీలు ఉన్నా ఒక్క ఎమ్మెల్యే సీటును బీసీలకు కేటాయించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 19.80 లక్షల మంది బీసీలు ఉన్నట్టు సమాచారం ఉంది.

బీసీలకు ఆదరణ ఎక్కడన్నా?

టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఆదరణ పథకం చేతివృత్తుల వారికి అండగా ఉండేది. ఈ పథకం కింద చేతివృత్తులు చేసుకునే వారికి 90 శాతం సబ్సిడీపై అత్యాధునిక పరికరాలు, పనిముట్లు అందించేవారు. ఈ పథకం కింద లక్షలాది మంది చేతివృత్తిదారులు లబ్ధిపొందారు. అయితే గత ఎన్నికల ముందు మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలకొచ్చిన ఈ ఉపకరణాలు పంపిణీ చేయకుండా వైసీపీ సర్కారు నిలిపివేయడంతో అవి తుప్పు పట్టిపోయాయి. అంతే కాకుండా అప్పటికే పెండింగ్‌లో ఉన్న లక్షల దరఖాస్తులను, చెల్లించిన డీడీలను పక్కన పడేసింది. కనీసం డీడీలు వెనక్కి ఇవ్వలేదు. బీసీలకు సంబంధించి 100 కిపైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకోవడం మినహా ఐదేళ్లూ ఒక్క పైసా జగన్ సర్కారు విడుదల చేయలేదు. బీసీ కార్పొరేషన్ల ద్వారా గతం నుంచి అమలవుతూ వచ్చిన అన్ని పథకాలను రద్దుచేసింది. యువతకు ఉపాధి కల్పించేందుకు 50 శాతం సబ్సిడీపై గరిష్ఠంగా రూ.25 లక్షల వరకూ రుణాలను గతంలో అందించేవారు. జగన్ వాటి ఊసే ఎత్తలేదు. గతంలో అమలుచేసిన ఓబీఎంఎంఎస్, ఎంబీసీ పథకాలను అటకెక్కించింది. బీసీ విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులకు ఎగనామం పెట్టారు. విదేశీ విద్య పథకాన్ని నీరుగార్చింది. టీడీపీ ప్రభుత్వం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీసీ భవన్లు,బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించేది. వీటికి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలను కేటాయించింది. నిర్మాణాలు ప్రారంభించి సగంలో ఉన్న భవనాల పనులు నిలిపివేసింది. అప్పటికే కేటాయించిన నిధులను రద్దుచేశారు. అంతటితో ఆగని వైసీపీ నేతలు బీసీ భవన్‌లు, కమ్యూనిటీహాళ్లకు కేటాయించిన విలువైన స్థలాలపై కన్నువేసి కబ్జా చేశారు. పిఠాపురంలో ఇటువంటి ప్రయత్నమే జరగగా బీసీ నాయకులు, టీడీపీ నేతలు అడ్డుకున్నారు. రజకుల కోసం చేపట్టిన దోబీ ఘాట్ల నిర్మాణాలు నిలిపివేశారు. టీడీపీ హయాంలో బీసీల్లోని అన్ని వర్గాలకు 30కిపైగా సంక్షేమ పథకాలు అమలుచేయగా వైసీపీ ప్రభుత్వం వీటన్నింటిని రద్దుచేసింది. జగనన్న చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పి దానిలోనూ ఆంక్షలు విధించి లబ్ధిదారుల సంఖ్యలో కోతలు పెట్టి ంది.ఈ ఒక్క పథకం మినహా బీసీల కోసం ఏ ఇతర పథకాలు అమలు చేయకపోవడం, బీసీలపై దాడులు జరుగుతున్నా నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు గురైంది. ఐదేళ్ల జగన్ ఏలుబడిలో బీసీలకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆయా వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

బీసీల స్థానిక రిజర్వేషన్లు కట్..కట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నా.. ఎస్సీలు, నా.. బీసీలు, నా.. మైనార్టీలు.. నా ఎస్టీలు అంటూ దీర్ఘాలు తీసే వైసీపీ అధినేత, సీఎం జగన్ స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగకుండా కుట్ర చేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీలకు మరీ అన్యాయం చేశారు. స్థానిక సంస్థల్లోనే కాదు.. చట్ట సభల్లో కూడా రిజర్వేషన్లు కావాలని పోరాడుతున్న బీసీలకు, ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లు తగ్గించేయడంతో బీసీల ప్రాతినిధ్యం తగ్గిపోయింది. టీడీపీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది. అప్పుడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చైర్మన్లు, మేయర్లు ఎక్కువ మంది బీసీలే ఉండేవారు. నూటికి మూడో వంతు రిజర్వేషన్లతో పాటు జనరల్ స్థానాల్లో కూడా బీసీలు గెలవడంతో స్థానిక సంస్థల్లో బీసీల బలమే ఎక్కువగా ఉండేది. కానీ వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్ల తగ్గించే కుట్ర జరిగింది. తర్వాత కోర్టు కూడా 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదని చెప్పడం ఈ కుట్రదారులకు అనుకూల పరిస్థితి ఏర్పడింది. దీంతో 2019లో వైసీపీ గెలిచిన తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు బాగా తగ్గిపోయాయి. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. ఏకంగా 10 శాతం తగ్గిపోవడంతో స్థానిక సంస్థలో పట్టుసాధిస్తున్న బీసీలంతా కుప్పకూలిపోయారు. 2014 తర్వాత టీడీపీ 34 శాతం రిజర్వేషన్లు అమలుచేసింది. తర్వాత ఇబ్బందులు రావడంతో వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకెళ్లి, వీటిని అమలుచేయడానికి ప్రయత్నిస్తే మేలు జరిగేది. కానీ అసలు పట్టించుకోకపోవడంతో బీసీలు, మహిళలు అనేక అవకాశాలను కోల్పోయారు. టీడీపీ ఈసారి 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని చెబుతోంది. అంతేకాక బీసీ చట్టం కూడా తీసుకుని వచ్చి, బీసీలకు రక్షణగా ఉండే ఏర్పాటు చేయడానికి కూడా మేనిఫెస్టోలో పెట్టింది.

- 30 బీసీ పథకాలు రద్దు
- కొండెక్కిన ఆదరణ
- ఉత్తుత్తి కార్పొరేషన్లు
- సబ్సిడీల్లేవ్.. సాయం లేదు
- రిజర్వేషన్లు కుదింపు
- బీసీ భవన్‌లు లేవు..

'నేతన్న నేస్తం' పేరుతో.. చేనేత పథకాలన్నీ రద్దు

అమలాపురం రూరల్ : చేనేత కార్మికులకు లబ్ధి చేకూర్చేలా గతంలో త్రిఫ్ట్ ఫండ్ స్కీమ్ అమల్లో ఉండేది. కార్మికుడు ఆదాయంలో 8 శాతం జమ చేసుకుంటే ప్రభుత్వం 16 శాతం నగదు ఏడాదికోసారి కార్మికుడికి తిరిగిచ్చేవారు. ఆ మొత్తాన్ని చంద్రబాబు పాలనలో 18 శాతానికి పెంచారు. పవర్‌లూమ్‌ధాటికి చేనేత వస్త్రాలు తట్టుకునే విధంగా 20 శాతం రిబేటు విధానం గత ప్రభుత్వాలు కొనసాగిస్తే చంద్రబాబు 30 శాతం రిబేటు ప్రకటించారు. రాయితీని జగన్ ప్రభుత్వం ఎత్తివేసింది. చిలప నూలు కొనుగోలుపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం రాయితీ ఇస్తే చంద్రబాబు ప్రభుత్వం దాన్ని 30 శాతానికి పెంచింది. తద్వారా 15 శాతం కార్మికుడికి లబ్ధి చేకూరితే మరో 15 శాతం సంఘాలకు లబ్ధి కలిగేది. సిల్కు, పట్టు నూళ్లపై సైతం రాయితీలను ఎత్తివేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. పావలా వడ్డీ రాయితీని జగన్ రద్దు చేశారు. చేనేతలకు హెల్త్ ఇన్సూరెన్స్‌తో రూ.15 వేలు వరకు లబ్ధి చేకూర్చేవారు. ఇప్పుడా పథకం లేదు. కార్మికులు 58 ఏళ్లలోపు చనిపోతే రూ.60 వేలు అందించేవారు. నేడు ఆ పథకాలన్నీ రద్దయ్యాయి. దేవాంగ సాధికార సమితి ఐటీడీపీ కో-ఆర్డినేటర్ కొండా సత్యనారాయణరాజు మాట్లాడుతూ 'నేతన్న నేస్తం' పేరుతో గత ప్రభుత్వాలు అమలుచేసిన అన్ని సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో నేతనేసే కార్మికుల సంఖ్య సైతం గణనీయంగా తగ్గిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న నగదు పరపతి సొమ్ములకు వడ్డీలు చెల్లించలేక మూతపడే పరిస్థితి తలెత్తుతుంది.

16,860 పదవులు కోల్పోయాం..



జగన్ బీసీల రిజర్వేషన్లు 34 నుంచి 24 శాతం తగ్గించడంతో స్థానిక సంస్థల్లో 16,860 పదవులు కోల్పోయాం. టీడీపీలో బీసీ కార్పొరేషన్ నిధులిచ్చారు. ఆదరణ పథకం పెట్టారు. వైసీపీలో వీటి జాడే లేదు.

- బత్తుల నాగేశ్వరరావు(నాగు), రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, దివాన్‌చెరువు

ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం



వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్లు ప్రకటించి పాలకవర్గాలను నియమించింది. లోన్లు వస్తాయని మాకు మేలు జరుగుతోందని ఆశించాం. ఐదేళ్లు గడిచినా బీసీలకు ఏ ప్రయోజనం చేకూరలేదు. నమ్మించి వంచించిన జగన్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం.

- మామిడి లలిత, గృహిణి, ఏలేశ్వరం

మినీ ఫిషింగ్ హార్బరు గాలికి..



టీడీపీ అంతర్వేదిలో రూ.33 కోట్లతో మినీ ఫిషింగ్ హార్బరు నిర్మాణం చేపట్టారు. రూ.20 కోట్లు మంజూరు చేసి సగం నిర్మించారు. మిగిలిన ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రభుత్వం మత్స్యకారుల జీవన భృతికి తూట్లు పొడిచింది. - తిరుమాని ఆచార్యులు, రాష్ట్ర మత్స్యకార సాధికార అధ్యక్షుడు, అంతర్వేది



తిరువీధుల మెరిసీ.. దేవదేవుడు

కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం కళాకారుల ప్రదర్శనల నడుమ తిరువీధుల్లో రథోత్సవం ఘనంగా జరిగింది. తీర్థంలో యువకులు, భక్తులు సందడి చేశారు. స్వామి, అమ్మవార్లను ఎదుర్కోలు మండపం వద్దకు తీసుకెళ్తున్న చిత్రమిది... 7లో



రాజమహేంద్రవరం లోక్‌సభకు నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థిని పురందేశ్వరి



రాజమహేంద్రవరం రూరల్‌కు నామినేషన్ దాఖలు చేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

భలే మంచిరోజు..

రెండో రోజు భారీగా అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో రెండో రోజు శుక్రవారం.. ఏకాదశి.. కావడంతో అసెంబ్లీ స్థానాలకు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో రెండు రోజుల్లో మొత్తం 18 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థినిగా దగ్గుబాటి పురందేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనపర్తి నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా నల్లమిల్లి మహాలక్ష్మి, కొవ్వూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వేంకటేశ్వరరావు, నిడదవోలు నుంచి జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇక వైసీపీ నుంచి రాజానగరం అభ్యర్థిగా జక్కంపూడి రాజా ఇంద్రవందిత్, గంధం రాజేశ్వరి, గోపాలపురం వైసీపీ అభ్యర్థినిగా మంత్రి తానేటి వనిత, జొన్నకూటి బాబాజీరావు నామినేషన్లు దాఖలు చేశారు. కొవ్వూరు కాంగ్రెస్ అభ్యర్థినిగా అరిగెల అరుణకుమారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొంత శ్యామ్ రవిప్రకాష్, నిడదవోలు నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) అభ్యర్థిగా కస్తూరి సత్యప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు.

కోనసీమలో 10..

అమలాపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన రెండో రోజు శుక్రవారం అసెంబ్లీ స్థానాలకు పది మంది నామినేషన్లు దాఖలుచేశారు. అమలాపురం లోక్‌సభకు రెండో రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వివిధ పార్టీల నుంచి పది మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అమలాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆర్డీవో కార్యాలయంలో రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో బీఎస్పీ నుంచి మాతా సుబ్రహ్మణ్యం ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జిత్తుక వెంకట్రావు ఒక సెట్ నామినేషన్లు వేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నుంచి పొన్నాడ నీరజ ఒక సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పాలెపు ధర్మారావు, సత్తిరాజు ఎస్‌వీయూవీఆర్ఎస్ స్వామి స్వతంత్ర అభ్యర్థిగా, బీర రాజకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మండపేట నుంచి నందికోళ్ల రాజు, నవతరం పార్టీ నుంచి మందపల్లి రవి స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు.

కాకినాడ జిల్లాలో...

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్19: కాకినాడ జిల్లాలో శుక్రవారం మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. కాకినాడ లోక్‌సభకు రెండు నామినేషన్లు వేశారు.ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన చందక అనూష భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) తరపున కాకినాడ లోక్‌సభకు నామినేషన్ దాఖలు చేశారు. గిడ్ల సింహాచలం కాకినాడ లోక్‌సభకు ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. వీరిద్దరూ నామినే షన్లను జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు అందజేశారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. తుని నియోజకవర్గానికి లాలం లోవరాజు ఇండిపెండెంట్‌గా, ప్రత్తిపాడు నుంచి వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ రూరల్ నుంచి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), కాకినాడ సిటీ నుంచి వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట నుంచి జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) కూటమి అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇక మిగిలిన పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఇదిలా ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థినిగా మిరియాల శిరీషాదేవి నామినేషన్ దాఖలు చేశారు.



నిడదవోలు కూటమి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కందుల దుర్గేష్



కొవ్వూరు కూటమి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

నరకయాతన



జగన్ కదిలితేనే కదలండి : ఎస్టీ రాజాపురం వద్ద ప్రయాణికుల అడ్డగింత



పిఠాపురంలో ట్రాఫిక్ జామ్

- సీఎం జగన్ రోడ్ షో.. జనానికి చుక్కలు
- కాకినాడ సభకు భారీగా ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల ఇక్కట్లు
- జగన్ రోడ్ షో.. జనాన్ని మండుటెండలో నిలిపేసిన పోలీసులు
- కాకినాడలో 'మేమంతా సిద్ధం' సభ
- మధ్యలోనే వెళ్లిపోయిన జనం
- పిఠాపురంలో బస్ లోపల్నుంచే అభివాదం

రాజమహేంద్రవరం/సర్పవరంజంక్షన్/పిఠాపురం/గొల్లప్రోలు/ప్రత్తిపాడు/కొత్తపల్లి/ఏలేశ్వరం, ఏప్రిల్19: సీఎం జగన్ రోడ్ షో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులకు నరకయాతనగా మారింది. కాకినాడ రూరల్ అచ్చంపేట వద్ద జరిగిన మేమంతా సిద్ధం సభకు భారీగా ఆర్టీసీ బస్సుల కేటాయించారు. దీంతో డిపోల్లో బస్సులు లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు యాత్ర దారిలో ప్రజలను ఎక్కడికక్కడ మండుటెండలో నిలిపివేశారు. పెద్దాపురం ఏడీబీ రహదారిపైకి రాకుండా బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు, ఆస్పత్రులకు వెళ్లేవారు సతమతమయ్యారు. జగన్ బస్సు యాత్ర రెండో రోజు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలోని బస కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు జగన్ బస్సులో బయలుదేరారు. యథావిధిగా నోరు విప్పకుండా ఏసీ బస్సులోంచి నమస్కారం పెడుతూ వెళ్లిపోయారు. జగన్ వస్తే జనాలకు తిప్పలు తప్పవనే నానుడి మరోసారి రుజువైంది. ముందస్తు సమాచారం లేకుండా ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్‌ని ఇష్టానుసారం ఎక్కడికక్కడ నిలిపి వేయడంతో జనం ఎండలో అల్లాడిపోయారు. రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వెళుతున్న ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను సీఎం బసకు కొద్దిదూరంలో రాజానగరం జంక్షను వద్ద బస్సుల్లోంచి దింపేశారు. వారి ఎక్కివచ్చిన ఆర్టీసీ బస్సులను అక్కడే నిలిపివేశారు. తమకు సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయని కనీసం ఒక్క బస్సునైనా అనుమతించాలని విద్యార్థులు పోలీసుల కాళ్లావేళ్లాపడ్డా కనికరించలేదు. దీంతో సుమారు 50మంది ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎండలో రోడ్డుపై, తాటిచెట్ల కింద నిలబడి వాహనాల కోసం ఒత్తిడి పడుతూ ఎదురుచూశారు. అటు కాకినాడ రూరల్ నియోజకవర్గానికి 300 ఆర్టీసీ బస్సులు, సిటీకి 150 బస్సులు సమకూర్చినా, బస్సులో సీఎం సభకు వచ్చేందుకు ప్రజలు నిరాసక్తత ప్రదర్శించడంతో నాయకులు ఖంగుతిన్నారు. ఫలితంగా సగానికి పైగా ఆర్టీసీ బస్సులు ఖాళీగానే కాకినాడ సిటీ, రూరల్, కరప మండలాల నుంచి అచ్చంపేట సెంటర్‌కు రావడం విశేషం. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడిన తర్వాత ప్రజలను ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించిన వెంటనే కార్యకర్తలు, మహిళలు సభా ప్రాంగణం నుంచి బయటకువెళ్లిపోవడం మొదలుపెట్టారు. దీంతో ఖంగుతిన్న నాయకులు సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లకుండా చూడాలంటూ పోలీసులను అభ్యర్థించడంతో కొద్దిసేపు పోలీసులు ప్రజలను నిలువరించినా, వీరి మాటలను పట్టించుకోకుండా బారికేడ్లు దాటుకుని మరీ బయటకు వెళ్లిపోవడం కనిపించింది.



మేం ఉండలేం నాయనో : కాకినాడ సిద్ధం సభ నుంచి మధ్యలోనే వెళ్లిపోతున్న జనం

80శాతంపైగా బస్సులు రద్దు

ఎన్నికలు వచ్చినా వైసీపీ అధికార దుర్వినియోగం ఆగడం లేదు. సీఎం జగన్ సిద్ధం సభకు ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు భారీగా వినియోగించారు. దీంతో ఆయా బస్టాపుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు, అనకాపల్లి, విశాఖపట్టణం జిల్లాల్లోని అన్ని డిపోలనుంచి ఆర్టీసీ బస్సులను తీసుకువచ్చారు. వీటికి అదనంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డిపోల ఆర్టీసీ బస్సులను సిద్ధం సభ కోసం కేటాయించారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, పిఠాపురం సహా అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులను సభ కోసం కేటాయించడంతో కాకినాడ-కత్తిపూడి-తుని-సామర్లకోట రూట్‌లో తిరిగే బస్సుల్లో 80శాతంపైగా రద్దు చేశారు. దీనివల్ల ఆయా బస్టాపుల్లో ఉదయం నుంచి ప్రయాణికులకు పడిగాపులు తప్పలేదు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలు, వ్యాపారాలు నిమిత్తం వెళ్లే వారితోపాటు వివిధ వర్గాల ప్రజలు, మహిళలు బస్సులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.

బస్సుయాత్రలో ఆగని జగన్

పిఠాపురం/పిఠాపురం రూరల్, ఏప్రిల్ 19: కాకినాడ రూరల్ అచ్చం పేటలో 'మేమంతా సిద్ధం' సభ ముగిసిన తర్వాత సీఎం జగన్ బస్సు యాత్ర పిఠాపురం బైపాస్‌రోడ్డులో వెళ్లింది. జగన్ కోసం ఎదురుచూపులు చూసిన వారికి నిరాశే మిగిలింది. బస్సును ఆపకుండా లోపల నుంచే అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పిఠాపురం మండలం చిత్రాడలో సీఎం జగన్ బస్సుయాత్రకు జనం కరువయ్యారు. జగన్ శుక్రవారం సాయంత్రం వస్తున్నట్టు ప్రచారం చేసినా ఎవ్వరు రోడ్ల మీదకు రాలేదు. దీంతో పోలీసులు రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపులను మూ యించకుండా వదిలివేశారు. జగన్ రాకతో ట్రాఫిక్ నిలిపివేత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్ రాక ముందు, వెళ్లిన తర్వాత గంటకు పైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు అందులో చిక్కుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టకపోవడంతో బైపాస్‌రోడ్డుకి ఇరువైపులా, పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వెళ్తున్న వారికి అనేక అగచాట్లు తప్పలేదు.



మీరు సిద్ధమే.. కానీ మేము.. : ఖాళీగా సిద్ధం సభకు వెళ్లే బస్ ఇలా



మీ మాటలు వినడానికి సిద్ధంగా లేం : కాకినాడలో జరిగిన మేమంతా సిద్ధం సభ నుంచి మధ్యలోనే వెళ్లిపోతున్న జనం

పెద్దాపురంలో రోడ్ షో వెలవెల

పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 19: మేమంతా సిద్ధం పేరుతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సీఎం జగన్‌కు పెద్దాపురం పట్టణంలో ప్రజలు గట్టి షాకిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం ఎస్టీ రాజాపురం నుంచి బయలుదేరిన సీఎం జగన్‌కు పెద్దాపురంలో స్వాగతం పలికేందుకు ఒక్కరూ కూడా రాలేదు. పెద్దాపురం పాండవుల మెట్ట జంక్షన్, వాలుతిమ్మాపురం జంక్షన్, ఆర్‌బీ పట్నం జంక్షన్‌లవద్ద జనాలు లేకపోవడంతో రోడ్ షో వెలవెలబోయింది. ఏడీబీ రహదారి పొడవునా బస్సు యాత్రకు జనం కరువయ్యారు. దీంతో రోడ్ షో చప్పగా సాగింది. జగన్ బస్సు యాత్ర కారణంగా ఉదయం 7 గంటల నుంచి ప్రజలు నరకయాతన అనుభవించారు. రాజమహేంద్రవరం వైపుగా వెళ్లే వాహనాలను పోలీసులు అనుమతించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఐదు గంటలపాటు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించాల్సి వచ్చింది. ఆస్పత్రికి వెళ్లే రోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అల్లాడిపోయారు.



ఏలేరు రిజర్వాయర్



'నాగలి పట్టిన రైతు' రమణయ్య

అమలాపురం రూరల్, ఏప్రిల్ 19: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలో కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన బత్తుల వెంకటరమణయ్య అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయిలో కీలక భూమిక పోషించారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆర్‌పీఐ తరపున అల్లవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే 1970వ దశకంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకు ఓ వింత పరిస్థితి ఎదురైంది. 1977 ఎన్నికల్లో ఆర్‌పీఐ, జనతా పార్టీ మధ్య పొత్తు కుదిరింది. రమణయ్యను అమలాపురం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించారు. అయితే ఆయన ఆర్‌పీఐ ఎన్నికల గుర్తు అయిన ఏనుగుపై కాకుండా జనతా పార్టీ నాగలిపట్టిన రైతు గుర్తుపై పోటీ చేయాల్సి వచ్చింది. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి కుసుమ కృష్ణమూర్తి విజయం సాధించారు.



బోర్డు కనిపించలేదా..?


అంబాజీపేట, ఏప్రిల్ 19: ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికి గ్రామస్థాయి అధికారులు మాత్రం ఆదేశాలను అమలు చేయడం లేదు. అంబాజీపేట మండలం మొసలపల్లి ప్రధాన రహదారిలో జగన్ చిత్రంతో ఉన్న బోర్డు అందరికి కనిపిస్తున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ఈ బోర్డును పంచాయతీ అధికారులు, సిబ్బంది తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మంచి ముహూర్తం కోసం..



తునిరూరల్, ఏప్రిల్ 19: ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఘట్టం ప్రత్యేకం. నామినేషన్ సమయంలో అంతా సందడి నెలకొంటుంది. ఇలాంటి ఘట్టానికి సమయం ఆసన్నమవడంతో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారు. బలమైన ముహూర్తం చెప్పాలంటూ పండితులు, స్వామిజీలను ఆశ్రయిస్తున్నారు. ఈ నెల 24,25 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. 24,25 తేదీల్లో ఉదయం నుంచి 9 నుంచి 11 గంటల మధ్యలో బాగున్నట్లు చెబుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ శుభ గడియల్లో నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

చంద్రబాబు సాగర్ ప్రాజెక్టు



మాటలు చెప్పి మోసం

చంద్రబాబు సాగర్‌పై నిర్లక్ష్యం

- పాదయాత్ర సమయంలో చంద్రబాబు సాగర్ ప్రాజెక్టుపై ఎనలేని ప్రేమ చూపించిన జగన్
- చంద్రబాబు..ప్రాజెక్టు అభివృద్ధిని పట్టించుకోలేదని కత్తిపూడి సభలో మొసలి కన్నీరు
- అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు ఊసే ఎత్తని సీఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ముఖ్యంగా ప్రత్తిపాడు మండలం కిత్తమూరిపేట వద్ద గల చంద్రబాబు సాగర్ ప్రాజెక్టుపై అప్పట్లో పాదయాత్రకు వచ్చిన జగన్ ప్రేమ కురిపించేశారు. కత్తిపూడిలో జరిగిన సభలో మొసలి కన్నీరు కారుస్తూ చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని చెప్పారు. అధికారంలో ఉన్నన్ని రోజులు ఈ ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. అయితే విచిత్రమేమిటంటే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ప్రాజెక్టు అభివృద్ధికి సంబంధించి ఊసే ఎత్తలేదు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై జగన్ మాటలు నీటి మూటలేనా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు సాగర్ ప్రాజెక్టు కానీ గోకవరం వద్ద గల సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు కానీ అభివృద్ధికి నోచుకోలేదు. చంద్రబాబు సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పొలాలకు సక్రమంగా కాలువలు ఏర్పాటు కాలేదు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు సాగునీటి వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ప్రత్తిపాడు-శంఖవరం, రౌతులపూడి మండలాలకు సాగునీటి అవసరాలు తీర్చే ఏలేరు, తాండవ కాలువల లింక్ ప్రాజెక్టు పూర్తి కాలేదు. తాండవ ఏలేరు లింకు ప్రాజెక్టుకు 2021 మార్చి 19న రూ. 470 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ జీవో జారీ చేసినా ఆ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. అదే విధంగా పుష్కర ఎత్తిపోతల పథకం అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల నియోజకవర్గంలో అనేక గ్రామాల పొలాలకు నీరు అందని పరిస్థితి ఉంది.



తాండవ రిజర్వాయర్



ఏలేరు జలాలను తాండవ రిజర్వాయర్‌కు లిఫ్ట్ ద్వారా పంపించి భూములను సస్యశ్యామలం చేస్తామని గత పాదయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ హామీ ఇచ్చారు. కానీ ఐదేళ్లు సీఎంగా పని చేసినా ఆ హామీని నెరవేర్చలేకపోయారు. ఈ హామీ నెరవేరుస్తారని రైతులు కొండంత ఆశతో ఎదురు చూశారు. కానీ చివరికి మిగిలింది నిరాశే..



ఎత్తికోతలు

ఎత్తిపోతల పథకాలపై ఉత్తి మాటలు

శంకుస్థాపనలతో కాలక్షేపం

- ఏలేరు-తాండవ లింక్ ప్రాజెక్టు కలగానే
- రూ.470 కోట్లతో అనుసంధానం అంటూ ఆర్భాటపు ప్రచారం
- పనులు ఒక్క అడుగు కూడా కదలని వైనం

కోటనందూరు, ఏప్రిల్ 19: తాండవ రిజర్వాయర్ ద్వారా సుమారు 60 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. కాకినాడ జిల్లాలో తుని నియోజవర్గంలో కోటనందూరు, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గంలో రౌతులపూడి, అనకాపల్లి జిల్లాలో నాతవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాలకు సాగు నీరు అందుతుంది. ప్రాజెక్టుకు ఏలేరు ఎత్తిపోతల పథకం ద్వారా తాండవ రిజర్వాయర్‌కు నీటిని పంపి మరో డెల్టా చేస్తామని వైసీపీ ప్రభుత్వ పెద్దలు హామీలు గుప్పించారు. అప్పట్లో పాదయాత్రకు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు జగన్ కూడా ఆ హామీనే ఇచ్చారు. అయితే తాండవ రిజర్వాయర్ నుంచి గేట్లు లీకేజీని అరికట్టలేని వారు ఎత్తిపోతల పథకం ఎలా కడతారని రైతులు అంటున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో స్థిరీకరణకు ఎప్పుడూ నోచుకోలేదు. రైతుల పరిస్థితి ప్రతి ఏడాది దయనీయ స్థితిలోనే ఉంది. తాండవ రిజర్వాయర్ నుంచి సాగునీరు రాకపోవడంతో శివారు భూములకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించవచ్చునని అధికారులు ప్రభుత్వ పెద్దలకు తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్ సుమారు మూడేళ్ల కిందట రూ.470 కోట్లతో పెదబొడ్డేపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. ఇందులో ఏలేరుకాల్వ నీటి సామర్థ్యం పెంపునకు రూ.250 కోట్లు ఖర్చు అవుతుందని లెక్కలు కట్టారు. అప్పటి నుంచి కాగితాలకే పరిమితమైయినది. ఇదంతా ఆరంభ శూరత్వమేనని రైతులు అంటున్నారు. రైతులకు ఎత్తిపోతల పథకం కడుతున్నామని చెప్పడం ఓట్లు దండుకోవడం కోసమేనని పలువురు వాపోతున్నారు. అధికారం కోసం ఎంతకైనా దిగజారుతారని ఈ ప్రాజెక్టు విషయమే స్పష్టం చేసింది.



టీడీపీలో నిధులు వైసీపీలో రద్దులు

ఆలమూరు, ఏప్రిల్ 19 : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆలమూరు మండలం చింతలూరులో గౌడ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేశారు. తీరా పనులు ప్రారంభించాక అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేయడంతో నిర్మాణం పునాదుల దశలోనే నిలిచిపోయింది. నిధుల మంజూరు కోసం ఐదేళ్లుగా నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఆలమూరులో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలుకు పేదల కోసం సేకరించిన ఇళ్ల స్థలాల్లో 40 సెంట్ల భూమి కేటాయించారు. ఏడాది కిందట హడావుడిగా రూ.40 లక్షలు కేటాయిస్తున్నట్టు ప్రకటించి కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. పునాదుల దాకా పనులయ్యాక నిలుపుదల చేశారు.

ఆలమూరు మండలం చింతలూరులో పునాదుల దశలోనే



ఆలమూరులో పునాదులకే పరిమితమైన దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 19: అంబాజీపేట స్త్రీల ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిలో మాచవరం గ్రామానికి సంబంధించి బీసీ కమ్యూనిటీ హాలును నిర్మించేందుకు టీడీపీ ప్రభుత్వంలో రూ.92 లక్షలను మంజూరుచేశారు. వీటికి 2016లో నిధులు మంజూరయ్యాయి. టీడీపీ హయాంలో నిధులు మంజూరు కాగా వాటి నిర్మాణాన్ని మొదలుపెట్టారు. వైసీపీ హయాంలో ఈ భవనానికి ఎటువంటి నిధులు మంజూరు చేయకపోగా చేసిన పనులకు నిధులను విడుదల చేసేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో అంబాజీపేటలో బీసీ కమ్యూనిటీ భవనం స్లాబు వరకూ నిర్మించి నిధులు మంజూరు కాగా అసంపూర్తిగా వదిలేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదని శెట్టిబలిజ సంఘ నాయకులు బొంతు గంగాధర్ (పెదబాబు), దొమ్మేటి రామారావు, గుత్తుల పండు తదితరులు తెలిపారు. అలాగే గంగలకుర్రులో నిర్మించిన కమ్యూనిటీ భవనం పూర్తికాగా నేటికీ ప్రారంభంకాలేదు. వక్కలంకలో ఇటీవల వైసీపీ నాయకులు బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో ఖాళీ స్థలమే నేటికీ దర్శనమిస్తోంది.

అంబాజీపేట మండలం మాచవరంలో అసంపూర్తిగా భవనం



అసంపూర్తిగా మిగిలింది..



స్లాబ్‌తో ఆగింది..

స్లాబ్ వరకు వచ్చి ఆగిన భవనం

పి.గన్నవరం, ఏప్రిల్ 19: పి.గన్నవరం శివారు అంబేడ్కర్ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ రిసోర్స్ హాల్ గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. 2018 మే 2వ తేదీన అప్పటి టీడీపీ ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి గెయిల్ ఇండియా లిమిటెట్ నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులను ప్రారంభించారు. స్లాబ్ దశ పూర్తిచేసుకున్న ఆ భవనం వైసీపీ ప్రభుత్వం రావడంతో నిధుల లేమితో అసంపూర్తిగా మిగిలిపోయింది. ప్లాస్టింగ్, విద్యుదీకరణ పనులకు ఈ అయిదేళ్ల కాలంలో నిధులు మంజూరుకాలేదు. ఈమధ్య కాలంలో రూ.10 లక్షల జడ్పీ నిధులు కేటాయించినప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో కమ్యూనిటీ హాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.

బీసీలపై ప్రేమ ఇదేనా?

ఎక్కడికక్కడ నిలిచిన బీసీ కమ్యూనిటీ హాళ్లు

సామాజిక భవనాల ఊసే లేదు..



బీసీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వారి సామాజిక అవసరాలకు భవనాలు నిర్మిస్తామని నాడు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కానీ ఎక్కడా సామాజిక భవనాల నిర్మాణానికి నయాపైసా విదల్చలేదు. 99 శాతం హామీలు అమలుచేశానని ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇలాంటి హామీలను ఎన్నిటినో నెరవేర్చలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసింది.

- కోరాడ కృష్ణ మోహన్, ఏలేశ్వరం



నిలిచిన పనులు

కేతరాజుపల్లిలో అసంపూర్తిగా

రావులపాలెం, ఏప్రిల్ 19: మండలంలోని కేతరాజుపల్లిలో 1, దేవరపల్లిలో 3, లక్ష్మీపోలవరంలో 1, రావులపాడులో 1 బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరుయ్యేలా ప్రతిపాదనలు రూపొందించారు. చిన్న చిన్న కాంట్రాక్టర్లు వారి సొంత ఖర్చుతో పనులు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో పునాదులు, మరికొన్ని ప్రాంతాల్లో స్లాబు వరకు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రాంట్లు రద్దు చేసింది. దీంతో పనులు నిలిచిపోయాయి.

బతుకు ఛిద్రం

నేత పని వదిలి కమ్మరి వృత్తిలోకి వెళ్లా..



గతంలో చేనేత పరిశ్రమ బాగుండేది. గత అయిదేళ్ల నుంచి చేనేత పరిశ్రమ అంతకంతకు తగ్గిపోతోంది. నేను, నా భార్య, ఇద్దరు పిల్లలు. పిల్లలకు పెళ్లిళ్ల చేశాం. గతంలో మేము నేసే చీరలు, ఇతర వస్త్రాలను చేనేత సొసైటీలు కొనుగోలు చేసేవి. ప్రస్తుతం చేనేత సొసైటీలు పరిస్థితి దారుణంగా ఉంది. నేను, నా భార్య మగ్గం నేత నేసేవాళ్లం. నెలలకు మా రెండు పడుగుల ద్వారా 16 చీరల వరకు నేత నేస్తాం. ఇలా చీరలు నేసినందుకు నెలకు రూ.4,500 ఇస్తారంతే. దానికితోడు నిత్యావసర ధరలు పెరిగి కుటుంబ ఖర్చులు బాగా పెరిగాయి. దాంతో చేనేతను వదిలి కొడవళ్లు, కత్తులు ఇలా కమ్మరి సామగ్రి కొనుగోలు చేసి వాటిని అమ్ముకుంటున్నా.

కొండపల్లి వీరబ్రహ్మకృష్ణ, వీరవరం, కడియం మండలం

బీసీలను అణగదొక్కారు..



వైసీపీ పాలనలో బీసీలను అన్ని విధాలుగా అణగదొక్కారు. టీడీపీలో ఉన్న పథకాలన్నీ కూడా తొలగించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ ఆదరణ, బీసీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్ తొలగించడంతోపాటు బీసీలకు ఎటువంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదు.

- బొండా శ్రీనుబాబు, బీసీ మండల నాయకుడు, సుబ్బయమ్మపేట, గండేపల్లి

యానాంలో

పోలింగ్ ప్రశాంతం

- 77.33 శాతం పోలింగ్ నమోదు
- స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు
- కట్టుదిట్టమైన పోలీస్ భద్రత
- జూన్ 4న ఓట్ల లెక్కింపు




ఓటుహక్కు వినియోగించుకున్న మల్లాడి కుటుంబ సభ్యులు, తల్లి భారతి, చిన్నాన్న వీర్రాజుతో ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, ఏప్రిల్ 19: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి సంబంధించి యానాం నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యానాంలో 39,408 మంది ఓటర్లకు పురుషులు 19,037, మహిళలు 20,371 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 14,821 మంది, మహిళలు 15,655 మంది మొత్తంగా 30,476మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.33శాతం పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం ఏడుగంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు యానాం నియోజకవర్గం పరిధిలోని 33 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. పోలింగ్ బూత్-12లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు, తనయుడు రఘువంశీ, అనుపమ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, తల్లి భారతి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రానికి ఊపందుకుంది. ఈవీఎంలు ఎక్కడా మొరాయించలేదు.

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరిన ఈవీఎంలు

యానాం నియోజకవర్గంలో పోలింగ్ ముగిసిన అనంతరం భారీ భద్రత మధ్య ఈవీఎంలు, వీవీప్యాడ్‌లను ఎన్నికల అధికారుల సమక్షంలో డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్స్‌కు తరలించి సీలు వేశారు. స్ట్రాంగ్‌రూమ్స్‌వద్ద సీసీ కెమెరాల పర్య వేక్షణలో భద్రత పర్యవేక్షిస్తున్నారు. జూన్ 4న యానాంలో ఓట్లను లెక్కిస్తారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 93శాతం ఓట్లు నమోదు కాగా, పుదుచ్చేరి పార్లమెంట్‌కు సంబంధించిన ఇప్పుడు యానాంలో 77.33శాతం నమోదయ్యాయి.

వైభవంగా వెంకన్న కల్యాణం

- వాడపల్లి తిరువీధుల్లో శ్రీవారి రథోత్సవం, భక్తుల సందడి
- ఆకట్టుకున్న కేరళ, చెన్నయ్ వాద్య కళాకారుల ప్రదర్శనలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



వేలాది మంది భక్తుల నడుమ స్వామివారి రథోత్సవం

ఆత్రేయపురం, ఏప్రిల్ 19: కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మేల్కొలుపు, నదీ జల సంగ్రహణం, విశేషార్చన, నిత్య హోమాలు, ద్రవిడ వేదపారాయణంలను శాస్త్రోక్తంగా జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మేళతాళ, మంగళవాయిద్యాలతో స్వామివారిని తోడ్కొని వెళ్లి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం వివిధ కళాకారుల ప్రదర్శనల నడుమ తిరువీధుల్లో రథోత్సవం జరిగింది. ఆలయాన్ని ఫల, పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తీర్థంలో యువకులు, భక్తులు వినోదాత్మక ప్రదర్శనలతో సందడి చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు భోజనం పెట్టడంతోపాటు మజ్జిగ చలివేంద్రాలద్వారా సేవలందించారు. వాడపల్లి పోరాటయోధుల స్థూపంవద్ద అమరవీరులకు దేవదాయ శాఖ ఆర్జేసీ విజయరాజు, ఉపకమిషనర్ భూపతిరాజు కిషోర్‌కుమార్ నివాళులర్పించారు.

కనుల పండువగా కల్యాణం

శ్రీనివాస ప్రాంగణంలో సర్వాంగసుందరంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామివారిని పల్లకీలో తోడ్కొని వచ్చి పెండ్లి కుమారుడిని చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మధుపర్కప్రాశన, కన్యాదానం, మహదాశీర్వచనంలను వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవిల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు అర్చకులు ఘనంగా జరిపారు. గోవింద నామస్మరణ, మేళతాళ మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ జరిగిన స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించి పునీతులయ్యారు. కల్యాణ తంతు జరిగినంతసేపూ వందల కిలోల కర్పూర జ్యోతిని వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి పట్టువస్త్రాలను దేవదాయశాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, ఆర్జేసీ ఎం.విజయరాజు సమర్పించారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్-ఉమాసుందరి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అధికారులు, సిబ్బందిఉత్సవాల్లో తమవంతు సేవలు అందించారు.

నామినేషన్ల జోరు



విజయం మనదే అంటున్న గోరంట్ల, పురంధేశ్వరి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్

అంబేడ్కర్ కోనసీమజిల్లా, కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో నాయకుల నామినేషన్లు జోరందుకుంది. శుక్రవారం ఏకాదశి కావడంతో రెండోరోజు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. భారీ జనసందోహంతో ఊరేగింపులతో, బైక్ ర్యాలీలతో బయలుదేరి వెళ్లి రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల పత్రాలను సమర్పించారు.

- భారీ జన సమీకరణలతో నాయకుల ర్యాలీ
- కదం తొక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

రాజమహేంద్రవరంరూరల్ అభ్యర్థి గోరంట్ల నామినేషన్ దాఖలు

కడియం/ రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 19: రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి శుక్రవారం బొమ్మూరు కలెక్టరేట్‌లో 10-30కు రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ముందుగా సోమాలమ్మ ఆలయంలో తమ కుటుంబసభ్యులతో గోరంట్ల ప్రత్యేకపూజలు చేశారు. గోరంట్ల తన నివాసం నుంచి ఎన్నికల ప్రచార వాహనంపై కుటుంబ సమేతంగా గోరంట్ల కుమార్తె కంతమనేని శిరీష, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ జనసందోహంతో, భారీ బైక్‌ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు ఈ సందర్భంగా గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్యేటి ప్రసాద్, జనసేన కడియం మండల అధ్యక్షుడుముద్రగడ వీరేష్, న్యాయవాదులు కలిపి రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి నామినేషన్

కొవ్వూరు, ఏప్రిల్ 19: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా ముప్పిడి ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో మెరకవీధి వినాయకునిగుడి, కనకదుర్గమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. నియోకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో కొవ్వూరు పట్టణమంతా జన సందోహంగా మారింది. జనసైనికులు చిరంజీవి, రామ్‌చరణ్, పవన్‌కల్యాణ్ చిత్రపటాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్, విజయవిహార్ సెంటర్‌మీదుగా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్న ముప్పిడి వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, బీజేపీ నాయకుడు పరిమి రాధాకృష్ణ, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, నామన పరమేష్, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, రంజిత్ పాల్గొన్నారు.

కూటమి నిడదవోలు అభ్యర్థిగా దుర్గేష్ నామినేషన్

నిడదవోలు, ఏప్రిల్ 19: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్ శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్‌వీ రమణ నాయక్‌కు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన నాయకుడు భోగవల్లి ప్రసాద్, బీజేపీ నాయకుడు బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం కూటమి అభ్యర్థిగా ఆనందరావు నామినేషన్

అమలాపురంటౌన్, ఏప్రిల్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

రంపలో మిరియాల శిరీషాదేవి నామినేషన్ దాఖలు

రంపచోడవరం, ఏప్రిల్ 19: రంపచోడవరం ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మిరియాల శిరీషదేవి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఈమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి ప్రశాంతకుమార్ అధికారికంగా ప్రకటించారు. రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్ ఈమె నామినేషన్‌ను ప్రతిపాదించారు. నామినేషన్ ప్రాథమిక పరిశీలన అనంతరం, రూ.5వేల ధరావత్తు చెల్లించాక రిటర్నింగ్ అధికారి శిరీషదేవితో ప్రమాణం చేయించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఈమెతో పాటు మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్, అధిష్ఠానం పంపిన తెలుగుదేశం నాయకుడు యర్రా వేణుగోపాలనాయుడు, శిరీషదేవి భర్త టీడీపీ యువజన నాయకుడు మఠం విజయభాస్కర్, ఆమె తరపు న్యాయవాది హాజరయ్యారు. కాగా మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావులు మాత్రం హాజరు కాలేదు.

అనపర్తి టీడీపీ అభ్యర్థినిగా మహాలక్ష్మి నామినేషన్

అనపర్తి, ఏప్రిల్ 19 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనపర్తి అసెంబ్లీ తెలుగుదేశం అభ్యర్థినిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనపర్తిలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆమె తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారిణి ఎం.మాధురికి అందజేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇదే మొదటి నామినేషన్ దాఖలు కావడం జరిగిందని ఆర్వో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వెంట టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి ఉన్నారు.



గోరంట్లను నామినేషన్ వేసేందుకు తీసుకెళుతున్న అభిమానులు

జగ్గంపేట టీడీపీ అభ్యర్థిగా జ్యోతుల నామినేషన్

జగ్గంపేట, ఏప్రిల్ 19: టీడీపీ-జనసేన-బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ శుక్రవారం ఉదయం 11.30గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక స్వగృహం నుంచి బయలుదేరి జగ్గంపేట గ్రామదేవత రావులమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11.11 నిమిషాలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి అక్కడినుంచి ఐదుగురి సభ్యులతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందించారు. ఆయన వెంట జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, కొత్త కొండబాబు ఉన్నారు.

అట్టహాసంగా పంతం నానాజీ నామినేషన్ దాఖలు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 19: కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థిగా పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) అట్టహాసంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ముందుగా కాకినాడ రూరల్ గొడారిగుంటలో పూజలు నిర్వహించారు. అనంతరం వలసపాకల గంగరాజునగర్‌లో జనసేన పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబీ), పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌లతో కార్యకర్తలతో కలిసి సర్పవరం జంక్షన్ ఆర్వో కార్యాలయానికి పాదయాత్ర ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్‌కు నానాజీ అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, కాళ్ల ధనరాజు, రంబాల వెంకటేశ్వరరావు, కౌజు నెహ్రూ, కాళ్ల సత్తిబాబు, పేరాబత్తుల లోవబాబు పాల్గొన్నారు.

కోలాహలంగా కొండబాబు నామినేషన్

కాకినాడసిటీ, ఏప్రిల్ 19: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు శుక్రవారం కోలాహలంగా నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ జగన్నాథపురంలోని తన స్వగృహంనుంచి కొండబాబు కూటమి పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, తోట సుధీర్, బీజేపీ నాయకులు పైడా భవనప్రసాద్, గట్టి సత్యనారాయణ తదితర నాయకులతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అశేష జన సందోహంతో కోలాహలం మధ్య అట్టహాసంగా సాగిన ఈ కార్యక్రమంతో నగరం పసుపుమయంగా మారింది. కొండబాబు సైకిల్ ర్యాలీగా బయలు దేరి చర్చిస్క్వేర్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ బ్రిడ్జి, వార్ఫ్ రోడ్, సినిమారోడ్, కొత్తపేట బ్రిడ్జి, కోకిల సెంటర్, భానుగుడి సెంటర్, కొండయ్యపాలెం మీదుగా కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత కొండబాబు స్వగృహం వద్ద సర్వమత ప్రార్థనలు జరిపి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నామినేషన్ దాఖలు చేసిన జక్కంపూడి

రాజానగరం, ఏప్రిల్ 19 : రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంద్ర వందిత్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి అందజేశారు. అలాగే రాజా సతీమణి రాజశ్రీ మరో సెట్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. తొలుత స్థానిక సాయిబాబాను దర్శించుకున్న అనంతరం వారు నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.



అమలాపురంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఆనందరావు



నామినేషన్ పత్రాలపై సంతకాలు చేస్తున్న నెహ్రూ



సర్పవరంలో భారీ ర్యాలీగా నామినేషన్‌కు వెళుతున్న పంతం నానాజీ



కాకినాడలో నామినేషన్ దాఖలుకు ర్యాలీగా వెళ్తున్న కొండబాబు



అనపర్తిలో నామినేషన్ దాఖలు చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి



రంపచోడవరంలో నామినేషన్ దాఖలు చేసి ప్రమాణం చేస్తున్న శిరీషదేవి

'పొన్నాడ' నామినేషన్

ముమ్మిడివరం, ఏప్రిల్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ తరపున పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన సతీమణి పొన్నాడ నీరజ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసినట్టు రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావు తెలిపారు.

ప్రత్తిపాడులో వరుపుల నామినేషన్ దాఖలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 19: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వరుపుల సుబ్బారావు శుక్రవారం మధ్యాహ్నం నామినేషన్‌ను దాఖలు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలనుంచి భారీ అనుచరగణంతో ఆయన ప్రత్తిపాడు చేరుకున్నారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో వరుపుల నామినేషన్ పత్రాలను ఆర్వో ఎ.శ్రీనివాసరావుకు అందజేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ అనంతబాబు, శంఖవరం మండలాధ్యక్షుడు పర్వత రాజబాబు, వరుపుల తనయుడు సూరిబాబు, గొల్లాజీలు ఉన్నారు.



వైసీపీ తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థులు రాజానగరంలో రాజా, ప్రత్తిపాడులో వరుపుల సుబ్బారావు, ముమ్మిడివరంలో సతీష్‌కుమార్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అర్చకులు, ఈవో

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గర్భాలయాలు మూసివేత

- ఈనెల 24 నుంచి జూన్ 30 వరకు అభివృద్ధి పనులు
- స్వామి శివలింగానికి రక్షణచర్యలు

ద్రాక్షారామ, ఏప్రిల్ 19: పంచారామ క్షేత్రం, ప్రసిద్ధిగాంచిన ప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 24 నుంచి జూన్ 30 వరకు స్వామివారు, అమ్మవారి గర్భాలయాలను మూసివేయనున్నారు. కేంద్ర పురావస్తుశాఖ స్వామివారి మూలవిరాట్(శివలింగం)కు రసాయనాలతో రక్షణ చర్యలు, మాణిక్యాంబ అమ్మవారి గర్భాలయంలో ఆధునికీకరణ పనులు చేపట్టడంతో స్వామి, అమ్మవారి గర్భాలయాలను, భక్తులు ప్రవేశించే దక్షిణద్వారాన్ని ఈనెల 24 నుంచి మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.టి.వి సత్యనారాయణ, ఆలయ అర్చకులు శుక్రవారం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమేశ్వరస్వామివారు మూలవిరాట్(శివలింగం)కు పాలు, పండ్లు రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న కారణంగా శివలింగం స్వరూపం దెబ్బతింది. రక్షణ చర్యలు చేపట్టాలని పురావస్తుశాఖతోపాటు పలువురు పీఠాధిపతులు సూచనలు చేశారు. దీంతో దేవదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతితో స్వామివారి ఆలయంలో రసాయన రక్షణ పనుల నిమిత్తం కేంద్ర పురావస్తుశాఖకు అప్పగిస్తున్నారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు రసాయన రక్షణ చర్యలు, అమ్మవారి గర్భాలయంలో గ్రానైట్‌తో ఆధునికీకరణ చేస్తారని ఈవో తెలిపారు.

సువర్ణ ధ్వజస్తంభం ఏర్పాటులో క్షీరాధివాసం

అన్నవరం, ఏప్రిల్ 19: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి త్వరలో ప్రతిష్ఠించనున్న సువర్ణ ధ్వజస్తంభ పూజలలో భాగంగా రెండోరోజైన శుక్రవారం క్షీరాధివాసం నిర్వహించారు. పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం యాగశాలవద్ద కలశలో ఉంచిన పూర్వపు ధ్వజస్తంభ కళాన్యాసానికి వైదిక కార్యక్రమాలు నిర్వహించి పాలతో పూజించారు. అనంతరం వీటిని అనివేటి మండపంలో ఉంచిన నూతన ధ్వజస్తంభం వద్ద క్షీరాదివాసంలో ఉంచారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులతో పాటుగా దేవస్థానం పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



క్షీరాధివాసం నిర్వహిస్తున్న రుత్విక్‌లు

నేడు పవన్‌కల్యాణ్ పిఠాపురం రాక

పిఠాపురం, ఏప్రిల్ 19: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శనివారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 20వ తేదీ ఉదయం 8గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వస్తారు. హెలికాప్టర్‌లో గొల్లప్రోలు మండలం చేబ్రోలు నివాసం వద్ద గల హెలిప్యాడ్‌కు ఉదయం 9.45గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఉదయం 10.30గంటలకు కొత్తపల్లి మండలం ఉప్పాడలోని ఫంక్షన్‌హాలులో నిర్వహించే టీడీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో పవన్ పాల్గొంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 2.30గంటలకు చేబ్రోలు చేరుకుని సాయంత్రం 4.30గంటలకు హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో జరిగే బహిరంగసభకు చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సమావేశం అనంతరం రాత్రి 9గంటలకు తిరిగి చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. 21వ తేది షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

కందుల దుర్గేష్‌కు మాతృ వియోగం



మృతి చెందిన మేడా పద్మావతి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19: జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ మాతృమూర్తి మేడా పద్మావతి(88) శుక్రవారం రాజమహేంద్రవరంలో మృతిచెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దుర్గేష్ శుక్రవారం నిడదవోలులో ఎన్నికల నామినేషన్ దాఖలు చేశారు. నిడదవోలు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేసే హడావిడిలో ఉన్న దుర్గేష్‌కు మాతృమూర్తి మృతివార్త తీవ్రంగా కలచివేసింది. నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని ఆయన హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకున్నారు. పద్మావతి కుమారుడైన దుర్గేష్ చిన్నవయస్సులోనే దత్తత వెళ్లారు. పలువురు తెలుగుదేశం, జనసేన, ఇతర పార్టీల నాయకులు పద్మావతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కాగా, కొద్దిరోజుల క్రితమే దుర్గేష్ సతీమణి మృతి చెందారు. దుర్గేష్ మాతృమూర్తి మృతిపట్ల జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

కన్నాయిగూడెం ఎంపీటీసీ దారుణ హత్య

- పాతకక్షల నేపథ్యంలో బండరాయితో కొట్టి చంపిన వైనం
- పరారీలో ఇద్దరు నిందితులు



బాలకృష్ణ మృతదేహంపై రోదిస్తున్న కుటుంబసభ్యులు(ఇన్‌సెట్‌లో బాలకృష్ణ ఫైల్)

ఎటపాక, ఏప్రిల్ 19: అల్లూరి జిల్లా ఎటపాక మండలం, కన్నాయిగూడెం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణ (43) గురువారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యారు. పాతకక్షల కారణంగానే ఈఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీటీసీ బాలకృష్ణకు, ఇదే గ్రామానికి చెందిన దారపునేని రమేష్ అనే వ్యక్తికి మధ్య పాతకక్షలు ఉన్నాయి. గురువారం రాత్రి దారపునేని రమేష్, భద్రాచలం పట్టణానికి సాయి అనే వ్యక్తి ఇరువురు కన్నాయిగూడెం సెంటర్లో ఉండి, ఎంపీటీసీ బాలకృష్ణకు ఫోనుచేసి, ఇక్కడకు రావాలని పిలిచారు. దాంతో ఎంపీటీసీ బాలకృష్ణ అక్కడకు రావడంతో దారపునేని రమేష్, ఎంపీటీసీ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈక్రమంలోనే వీరి మధ్య గొడవకాస్త చిలికిచిలికి పెద్దగా మారడంతో మద్యంమత్తులో దారపునేని రమేష్ పక్కనేఉన్న బండరాయితో ఎంపీటీసీ బాలకృష్ణ తలపై మోదాడు. ఆ సమయంలో సాయి అనే వ్యక్తి రమేష్‌కు సహకరించాడు. దాంతో తలబాగం పగిలి, తీవ్రగాయాలతో రక్తస్రావమై, అక్కడికక్కడే ఎంపీటీసీ మృతి చెందారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చేలోపు నిందితులు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

వైభవంగా స్వామి వారి కల్యాణం

ధవళేశ్వరం ఏప్రిల్19: శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక జూనియర్‌కళాశాల ఆవరణలో అందంగా అలంకరించిన భారీవేదికపై అశేష భక్తజనం మధ్య స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆశీనులుచేసి గ్రామాల్లో ఊరేగించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయం ప్రాంగణం విద్యుత్‌దీపాలతో, పూలమాలలో ఆకర్షణీయంగా అలకరించారు.

ఏజెన్సీ సమాచారం

'రాక్షస పాలనపై ఓటు అస్త్రాన్ని సంధించాలి'

రంపచోడవరం, ఏప్రిల్ 19: అటు రాష్ట్రంలోనూ, ఇటు మన్యంలోనూ రాక్షస పాలన సాగుతోందని, ఈ ఎన్నికల ద్వారా ఇద్దరు రాక్షసులనూ రాష్ట్రం నుంచీ, మన్యం నుంచి తరిమి కొట్టేందుకు ప్రజలు తమ ఓటు అస్త్రాన్ని సంధించాలని రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన ఆమె మీడియాతోనూ, తర్వాత రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్లో రోడ్‌షోలోనూ మాట్లాడారు. రాష్ట్రాన్ని జగన్ అనే రాక్షసుడు దోచేస్తున్నాడని, ఎక్కడా కూడా శాంతి భద్రతలు లేవని అన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చి, తన పాలనతో ప్రజలకు నరకాన్ని చూపించాడని, పోలవరం నిర్వాసితులనైతే నిలువునా ముంచేశాడని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ, మన్యంలోనూ రాక్షస పాలన పోవాలంటే కూటమి అధికారంలోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

రంపచోడవరం, ఏప్రిల్ 19: ఎటపాక మండలం కన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణను హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ, ఆదివాసీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివాసీలు రాజకీయంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతూ నిలదొక్కుకుంటున్న సమయంలో ఆదివాసీ ఎంపీటీసీని అతి కిరాతకంగా హత్య చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంగల శ్రీనివాసు, కత్తుల ఆదిరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లయిన ఆదివాసీలకు రక్షణ లేదన్నారు. ఆదివాసీలపై రోజురోజుకు దాడులు ఎక్కువైపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ, ఉద్యోగుల సంఘం నాయకులు పొడియం పండుదొర, మట్ల కృష్ణారెడ్డి, చవలం శుభకృష్ణ, మడకం ప్రసాద్, పండా పవన్, కారం రామన్నదొర, కత్తుల సన్యాసిరెడ్డి, కత్తుల రమణారెడ్డి, తెల్లం శేఖర్, బంధం రామకృష్ణ పాల్గొన్నారు.

కన్నాయిగూడెం రహదారిపై ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

ఎటపాక, ఏప్రిల్ 19: కన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ధర్నా నిర్వహించారు. నిందితులను తక్షణమే అదుపులోకి తీసుకుని, విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, గుండాల ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, వైసీపీ నాయకులు మంత్రిప్రగడ నర్సింహారావు, మాదిరెడ్డి కృష్ణబాబు, కొవ్వూరి రాంబాబు, శివ, కురినాల బుజ్జి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఎటపాక, ఏప్రిల్ 19: ఎంపీటీసీ వర్సా బాలకృష్ణను అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో హత్యను ఖండించారు. ఏజెన్సీలో కుతంత్ర రాజకీయాలకు చరమగీతం పాడాలంటే ఆదివాసీ బిడ్డ బాలకృష్ణను చంపిన నిందితులను శిక్షించాలన్నారు. రోజురోజుకు ఆదివాసీలకు రక్షణ కరువైందని అన్నారు.

వర్షాలు, వరదల పట్ల జాగ్రత్తలు అవసరం

కూనవరం, ఏప్రిల్19: ఈ ఏడాది వర్షాలతో పాటు వరదలు అధికంగా ఉండే అవకాశముందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. శుక్రవారం శబరి గోదారి సంగమం వద్ద ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే ఈసారి వర్షాలు, వరదలు అధికంగా వచ్చే అవకాశముందన్నారు. దీనికి గాను ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ నిర్వహించిన డ్రిల్ కార్యక్రమాన్ని తిలకించారు. వరదల్లో చిక్కుకున్న బాధితులను ఎలా రక్షించాలి, అకస్మాత్తుగా బోటు మునిగితే ప్రయాణికులను ఎలా కాపాడాలి అనే కార్యక్రమాలు ఎన్డీఆర్ఎఫ్ బృందం శబరి గోదావరి సంగమం వద్ద నిర్వహించింది.

మావోయిస్టుల కరపత్రాలు

ఎటపాక, ఏప్రిల్ 19: జల్, జంగల్, జమీన్ ఇజ్జత్ అధికారం దక్కే వరకు ఇంద్రవెల్లి అమరుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిస్తూ శుక్రవారం ఎటపాక మండలంలో భద్రాచలం- కూనవరం రోడ్‌లో ప్రధాన రహదారి వెంబడి గన్నవరం గ్రామ శివారు ప్రాంతం నుంచి నందిగామ గ్రామ శివారు ప్రాంతం వరకు భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి డివిజన్ కమిటీ పేరుతో మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి. గిరిజన యూనివర్సిటీలను ఏర్పాటు చేసి, ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసు, ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపేయాలన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న గిరిజనేతర గ్రామాలను గిరిజన గ్రామాలుగా గుర్తించాలని పేర్కొన్నారు. కవ్వాల టైగర్ జోన్‌ను ఎత్తివేయాలని పేర్కొన్నారు. పోలీసులు కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

గోదావరిలో రాకపోకలకు కాలువ

కూనవరం, ఏప్రిల్ 19: వేసవి రావడంతో గోదావరి ఎడారిగా మారింది. ఎక్కడ చూసిన నీటి చుక్క కూడా కనిపించలేదు. కూనవరం రుద్రమకోట మధ్య ఉన్న పడవరేవులో వెళ్లే ప్రయాణికులు ఇరువైపులా వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. దీంతో రుద్రమకోట రేవు పాట దక్కించుకున్న యజమాని ఇసుకలో ప్రొక్లెయిన్‌తో కాలువ తీశారు. సుమారు 50 అడుగుల వెడల్పుతో మూడు కిలోమీటర్ల మేర కాలువ తవ్వడంతో ఈ కాలువలో నీరు చేరింది. దీంతో పడవలో ఈకాలువ ద్వారా ప్రయాణికులను దాటిస్తున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రయాణికుడి ఒక్కరికి రూ.40, ద్విచక్ర వాహనానికి రూ.50 తీసుకోవలసి ఉండగా ప్రయాణికుడికి రూ.50, ద్విచక్ర వాహనానికి రూ.100 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

భారీ వృక్షం తొలగింపు

మోతుగూడెం, ఏప్రిల్ 19: మోతుగూడెం పరిధిలో ఉన్న గోపాలపురం గోడ్లగూడెం మార్గ మధ్యంలో భారీ వృక్షం నేలకొరిగింది. కార్చిచ్చును నియంత్రించిన ఫారెస్ట్ సిబ్బంది చెట్టును రోడ్డు మీద నుంచి తొలగించారు.

మహిళలకు భరోసా... పేదలకు అండగా ఉంటా

- కూటమిని గెలిపించండి
- ఇంటింట ప్రచారంలో అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19: మహిళా సాధికారతకు పెట్టింది పేరు తెలుగుదేశం పార్టీ, తమ నాయకుడు చంద్రబాబు అని అందువల్ల మహిళలు అధైర్యపడకుండా కూటమి అధికారంలోకి తీసుకువస్తే మీ భవిష్యత్‌కు తాను భరోసా అవుతానని, అండగా నిబడతానని టీడీపీ-జనసేన-బీజేపీ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 36వ డివిజన్‌లో శుక్రవారం ఆయన ఇంటింట ప్రచారం చేశారు. మహిళలను, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను, కార్మికులను ఆయన కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో తమ నాయకుడు చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తారని చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలు నెలకొల్పుతారని ఉపాధి అవకాశాలు తీసుకువస్తారని, పేదలకు సంక్షేమ పథకాలు చేరువ చేస్తారని చెప్పారు. అలాగే తనను రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగరాన్ని ఆరోగ్య రాజమహేంద్రవరంగా తీర్చిదిద్దుతానని, సురక్షితమైన తాగునీరు సరఫరా, మెరుగైన పారిశుద్ధ్యం అందించేందుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, మహిళల రక్షణకు ప్రత్యేక రక్షణ దళం ఏర్పాటు, స్పోర్ట్స్ కోసం మల్టీపర్పస్ కాంప్లెక్స్, నగరం టూరిజం హబ్‌గా అభివృద్ధి, దేవాలయాలను కలుపుతూ ప్రత్యేక టూరిజం వంటి వాటిని చేపడతామన్నారు. రాజమహేంద్రవరాన్ని ఆదర్శవంతమైన నగరంగా అభివృద్ధి చేస్తామని ఎక్కడా రాజీపడకుండా పూర్తి నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు చేస్తామన్నారు. తాను గురువారం నామినేషన్ వేస్తే వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారని అదే రోజు సీఎం జగన్ బస్సుయాత్రకు జనం లేరని అంటే ఈ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్రజలను మార్గాని భరత్‌రామ్ మోసం చేశాడని అన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తంగెళ్ల బాబి, స్థానిక టీడీపీ, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్



మహిళకు తాను ఉన్నానని ధైర్యం చెబుతున్న వాసు

50 డివిజన్‌లో గన్ని కృష్ణ ప్రచారం

రాజమహేంద్రవరం 50 డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఆర్గనైజింగ్ రాజమహేంద్రవరం సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్ ఆధ్వర్యంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో ప్రజాపరిపాలన స్థాపించాలన్నారు.



వాసును గెలిపించాలని ప్రచారం చేస్తున్న గన్ని కృష్ణ, కాశి నవీన్, రవియాదవ్

సాంకేతిక రంగంలో క్వాంటం కంప్యూటింగ్ ఆధునికం

- జీజీయూలో అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఏప్రిల్ 19: సమాచార సాంకేతిక రంగంలో క్వాంటం కంప్యూటింగ్ అత్యంత ఆధునికమైందని పూణెలోని జీహెచ్ రైసోని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎంయు కారత్ అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయు)లో ఆవిష్కరణ సాంకేతికతలో ఇటీవల పోకడలు అనే అంశంపై రెండు రోజులు అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. గైట్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కారత్ మాట్లాడుతూ వేగం ఖచ్చితత్వంతో పనిచేయడం క్వాంటం కంప్యూటింగ్ ప్రత్యేకత అన్నారు. భవిష్యత్తులో దీని అవసరాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం రూ.6వేల కోట్ల నిధులతో జాతీయ క్వాంటం మిషన్‌ను ప్రారంభించిందని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌పై పరిశోధనకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థులు పరిశోధకులు వినియోగించుకోవాలన్నారు. గైట్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ఆర్ఎస్‌రాజు, సదస్సు కన్వీనర్ శ్రీజ మధు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.లీలావతి, ఎస్వీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

అనపర్తి, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అనపర్తి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ఎం.మాధురి సూచించారు. శుక్రవారం అనపర్తిలో ఆమె బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎన్నికల ఖర్చులపై పూర్తిస్థాయి నిఘా: కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19: జిల్లాలో జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చులపై పూర్తిస్థాయిలో నిఘా ఉందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఆమె ఎన్నిలక ఖర్చుల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల ఖర్చుల పరిశీలకులు రోహిత్ నగర్, నితిన్ కురాయిన్, జై అరిండ్, రాజమహేంద్రవరం ఆర్వో కె.దినేష్‌కుమార్, రూరల్ ఆర్వో ఎన్.తేజ్‌భరత్‌లు హాజరయ్యారు. ఎన్నికల ఖర్చులపై క్షేత్రసాయి పరిశీలనలు, రికార్డుల నిర్వహణ, నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా చేపడుతున్న కార్యకలాపాలపై సమీక్షలు, ఎన్నికల కమిషన్ నియమావళి, మార్గదర్శకాలు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఇకపై చేసే ఖర్చులు నామినేషన్ దాఖ చేసిన అభ్యర్థుల ఖాతా కింద నమోదు అవుతాయని చెప్పారు. అలాగే ఎన్నికల ఖర్చుల విభాగం కలెక్టరేట్, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ కార్యాయంలో కూడా ఇదే సమావేశాన్ని ఆర్వో, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ నిర్వహించారు.

కూటమి ప్రభుత్వానే ప్రజలు కోరుకుంటున్నారు: నెహ్రూ

గోకవరం, ఏప్రిల్19: కూటమి ప్రభుత్వానే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తంటికొండలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతీ వీధిన తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఓటర్లను నెహ్రూ అభ్యర్థించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలం అయేదన్నారు. చంద్రబాబునాయుడు హయంలో సుమారు 72శాతం పనులు పూర్తవ్వగా వైసీపీ ప్రభుత్వ హయంలో పోలవరం పనులు పూర్తిగా అటకెక్కియన్నారు. అలాగే గోకవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ సీనియర్ నాయకులు శుక్రవారం నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటూ ఎన్‌డీఏ కూటమికి ఓటెయ్యండి

బిక్కవోలు, ఏప్రిల్ 19: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్‌డీఏ కూటమికి ఓట్లువేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన బిక్కవోలులోని పంచాయతీ వీధి, చెరువుగట్టుపై ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కొవ్వూరు సమస్యలపై పదేళ్లుగా పోరాటం

- కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి రుద్రరాజు



కొవ్వూరులో నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 19: నిబద్ధత కలిగిన కార్యకర్తగా అరుణకుమారికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొవ్వూరు టిక్కెట్టు కేటాయించిందని, ఆమె పదేళ్లుగా నియోజకవర్గ సమస్యలపై పోరాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ జెండాను ప్రతి గ్రామానికి తీసుకెళ్తున్నారని ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరిగెల అరుణకుమారి శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీ అభ్యర్థి రుద్రరాజు ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల స్పందన బాగుందన్నారు. పార్టీ ప్రకటించిన 9 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. అరుణకుమారి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచించిన విధంగా మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. కాగా కొవ్వూరులోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు నామినేషన్ వేయడానికి ఆర్డీవో కార్యాలయానికి పాదయాత్రగా తరలివెళ్లారు. దారి పొడవునా రుద్రరాజుకు ప్రజానీకం అభివాదం చేస్తూ, వారికి కరచాలనం చేశారు. జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్ నినాదంతో కొవ్వూరు పట్టణం మారుమోగింది. కార్యక్రమంలో రాజమహేంద్రవరం అర్బన్ అభ్యర్థి బోడ వెంకట్, అధికార ప్రతినిధులు కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, యూత్ కాంగ్రెస్ బిల్డర్ బాబి, కె.శ్రీనివాస్, శెట్టి ప్రతాప్, కొవ్వూరు పట్టణాధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజి, గెడ్డం సాయిబాబా, పాలకుర్తి ప్రభాకర్, కొణిదల శ్రీనివాస్, అందే వెంకట నాగభూషణం, గుమ్మాపు జాన్, కొయ్యా వెంకట్రావు, ఎం.నాగాంజనేయులు, సీపీఎం నాయకులు సుందర బాబు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల రాక్షస పాలనకు 25 రోజుల్లో విముక్తి

- గోరంట్ల నామినేషన్‌కు భారీ ర్యాలీ • కదలివచ్చిన అభిమాన తరంగం
- సిరా చుక్క మౌనం పాటిస్తే.. సారా చుక్క రాజ్యమేలుతుంది!
- 13న ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి
- కూటమి ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి



నామినేషన్ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో వస్తున్న గోరంట్ల

కడియం/ రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలనకు మరో 25 రోజుల్లో విముక్తి కలుగుతుందని.. ఈ అరాచక పాలన విముక్తి కోసమే కూటమి ఏర్పాటైందని రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బొమ్మూరు కలెక్టరేట్‌లో శుక్రవా రం ఉదయం 10-30 గంటలకు రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌కు నామినేషన్ పత్రాలు అందచేశారు. ముందుగా సోమాలమ్మ ఆలయంలో కుటుంబీకులతో గోరంట్ల ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచార వాహనంపై కుటుంబ సమేతంగా గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీష, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి వేలాదిగా భారీ జనసందోహంతో, భారీ బైక్‌ర్యాలీగా నామినేషన్ వేసేందుకు బయలుదేరారు. సోమాలమ్మ ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, కోటిపల్లి బస్టాండ్, ధవళేశ్వరం, శేఖర్ థియేటర్ రోడ్డు, హర్లిక్స్ ఫ్యాక్టరీ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ చరిత్రలో ఏనాడు లేని విధంగా తన నామినేషన్ కార్యక్రమం జరిగిందన్నారు. ఇది వైసీపీ ప్రభుత్వ పతనానికి నాంది అన్నారు. తన నామినేషన్‌కు తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సిరా చుక్క మౌనం పాటిస్తే సారా చుక్క రాజ్యమేలుతుందన్నారు. ఈ సారి రూరల్‌లో అత్యధిక మెజారిటీతో ప్రజలు తనను గెలిపిస్తారనే నమ్మకం ఏర్పడిందన్నారు. ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



కుటుంబ సమేతంగా బయలుదేరిన దృశ్యం



భారీ ర్యాలీతో నామినేషన్‌కు వస్తున్న గోరంట్ల

'వారాహి యాత్రను విజయవంతం చేయండి'

కోరుకొండ, ఏప్రిల్ 19: ఈనెల 20వ తేదీన శనివారం సాయంత్రం 5గంటలకు కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో జరిగే పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరీయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం కోరుకొండ జనసేనపార్టీకార్యాలయంవద్ద కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడారు. కోరుకొండ గ్రామంలో జరిగే వారాహి సభను మునుపు ఎన్నడూ జరగని విధంగా కనీవినీ ఎరగనిరీతిలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అనపర్తిలో రూ.94వేల నగదు స్వాధీనం

అనపర్తి, ఏప్రిల్ 19 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనపర్తి కెనాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎఫ్ఎఫ్‌టీ చెక్‌పోస్టు వద్ద శుక్ర వారం తనిఖీలు నిర్వహిస్తుండగా కొంకుదురు గ్రామానికి చెందిన కె.సాయిబాబారెడ్డి కారులో లెక్కలేని సొమ్ము రూ.94వేలు గుర్తించి సీజ్ చేసినట్లు చెక్‌పోస్టు ఇన్‌చార్జి వనమయ్య తెలిపారు. సదరు వ్యక్తికి రశీదు అందజేసి సొమ్మును అనపర్తి పోలీస్ స్టేషన్‌లో జమ చేసినట్లు వనమయ్య తెలిపారు.

సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సెబ్ పోలీసులు వివిధ ప్రదేశాల్లో జరిపిన సోదాల్లో 213లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 2800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 3 కేసులు నమోదు చేశారు. దివాన్ చెరువుకు చెందిన మార్గాని వెంకట్, హుకుంపేటకు చెందిన ఈత సాయి కుమార్, గంగుల రాజు, రాజానగరానికి చెందిన పిత పోసిలను అరెస్టు చేశారు.

చేతి రాతలో ప్రతిభ

మోతుగూడెం, ఏప్రిల్19: మదర్‌థెరెసా చిల్డ్రన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఔరంగాబాద్ మహారాష్ట్ర వారు నిర్వహించిన చేతిరాత పోటీల్లో మోతుగూడెం ఏపీ జెన్కో డీఏవీ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి బి. జగదీష్ ప్రతిభ కనబరిచి కన్సొలేషన్ బహుమతికి ఎంపికయ్యాడు. రూ.1000 బహుమతి పొందాడు. చెక్కును డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రఘురాం అందజేశారు.

36 పేజీల వివాహ శుభలేఖ



రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 19: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు, ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ అమ్మ ఒడి సేవా తరంగిణి కార్యదర్శి శివస్వామి వివాహం సందర్భంగా ఆహ్వానించడానికి ప్రచురించిన 36 పేజీల వివాహ శుభలేఖ ఆహ్వానితులను ఆశ్చర్యపరచింది. శుక్రవారం ఉదయం కొవ్వూరు మెయిన్ రోడ్డులోని రాజ్యలక్ష్మిగోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ పునప్రతిష్ఠ మహోత్సవంలో ఈ 36 పేజీల శుభలేఖ శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆవిష్కరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఎలక్ట్రానిక్స్ సహాయాచార్యులు, శ్రీ అమ్మ ఒడి సేవా తరంగిణి అధ్యక్షుడు విజయదుర్గా కుమార్(విజయ్ స్వామి) మాట్లాడుతూ ఈ శుభలేఖ వివాహంలోని నిశ్చితార్థం మొదలుకొని 16 రోజులు పండుగ వరకు ఉన్న అన్ని ఘట్టాలను సూక్ష్మంగా వివరించామని, ఈ ఘట్టాల గురించి స్థూలంగా తెలుసుకోవాలన్న వారి కోసం ఆహ్వాన పత్రికలో ప్రతీ ఘట్టం వద్ద క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు తమ ఫోన్లలో గూగుల్ లెన్స్ ద్వారా గాని క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్కాన్ చేస్తే శ్రీ అష్ట అను యూట్యూబ్ చానెల్ ద్వారా ప్రవచన వీడియోలు ఫోన్లలో వీక్షించవచ్చని తెలిపారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ ప్రచారక్ సోముజీ మాట్లాడుతూ నేటి తరాలకు వివాహం ఎలా చేయాలన్న ప్రశ్నకి, సందేహాలకు, అవగాహనకు ఈ ఒక్క శుభలేఖ ఉంటే చాలని ఆనందాన్ని వ్యక్తపరిచారు.

పాత సోమాలమ్మకు పురందేశ్వరి పూజలు



పురందేశ్వరిని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 19: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా శ్యామలానగర్‌లోని గ్రామదేవత, పాత సోమాలమ్మ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

బీజేపీలో పలువురు చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19: ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు తన అనుచరులైన నియోజకవర్గంలోని పలు మండలాల వైసీపీ నాయకులు సుమారు 30 మందితో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో వీరంతా బీజేపీ కండువా కప్పుకున్నారు. విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రాజేష్ వర్మ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024 | 5

ఎన్నికల ఖర్చులపై పూర్తిస్థాయి నిఘా : మాధవీలత 8



తిరువీధుల మెరిసీ..
దేవదేవుడు

కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం కళాకారుల ప్రదర్శనల నడుమ తిరువీధుల్లో రథోత్సవం ఘనంగా జరిగింది. తీర్థంలో యువకులు, భక్తులు సందడి చేశారు. స్వామి, అమ్మవార్లను ఎదుర్కోలు మండపం వద్దకు తీసుకెళ్తున్న చిత్రమిది... 7లో



జగనన్నా నీ భాషలో నా అంటే ఏంటన్నా.. వదిలేయడమా.. పట్టుకోవడమా.. లేదంటే నమ్మించి మోసం చేయడమా.. ఇదీ ఒక బీసీ నాయకుడి ప్రశ్న.. మీకెందుకా డౌటు అంటే..!? నా బాణం అంటూ గత ఎన్నికల్లో చెల్లెలు షర్మిలను ఊరూవాడా తిప్పారు.. చివరకు ఏం జరిగింది.. అధికారం వచ్చిన తరువాత ఆమె ఎవరో కూడా మర్చిపోయారు.. చివరికి సీఎం జగన్ సొంత చెల్లెలు కాంగ్రెస్ పంచన చేరింది.. 2024 ఎన్నికల వేళ... జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. నా బీసీలు.. నా ఎస్సీలు.. నా ఎస్టీలంటూ ఊదరగొడుతున్నారు.. ఒకసారి బీసీల సంగతే తీసుకుంటే.. ఈ ఐదేళ్లలో బీసీలకు చేసిందేంటి.. ఏమీలేదు.. రిజర్వేషన్లు కుదించేశారు.. ఆదరణ పథకం అటకెక్కించేశారు.. బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణమూ ఆపేశారు.. కార్పొరేషన్లు పెట్టారు.. ఒక్క రూపాయి విడుదల చేయకుండానే పాలన ముగించేశారు.. మాట్లాడితే నా బీసీలనే జగన్.. ఐదేళ్లూ వెనుకబడిన తరగతులకు చేసిందేంటి.. చెల్లి షర్మిలను పక్కనబెట్టేసినట్టే.. బీసీలను వెనుకబడేశారు.. ఎన్నికల వేళ నా బీసీలంటూ మళ్లీ ఓటు రాజకీయం ఆరంభించారు.. బీసీల్లారా తస్మాత్ జాగ్రత్త!? ఈ సారైనా మేల్కొండి.. అంటూ బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి.

ఐదేళ్లూ..వెనకబడే!

నా బీసీలంటూనే... జగన్ మోసం



ఐదేళ్లుగా ఇంతేగా : పిఠాపురంలో ఖాళీగా బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలం



వీరవరంలో చేనేత

పిఠాపురం, ఏప్రిల్ 19 : నా.. బీసీలు అంటూ చిలక పలుకులు పలుకుతున్న జగన్ తన ఐదేళ్ల పాలనలో వారిని నమ్మించి నిలువునా మోసం చేశారు. అండగా నిలబడతానని చెప్పి అణగదొక్కేశారు. చేతివృత్తుల వారికి చేయూతను ఇచ్చే ఆదరణ పథకాన్ని అర్థాంతరంగా నిలిపివేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన ఉపకరణాలు తుప్పు పట్టించేశారు. బీసీ భవన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపును రద్దు చేశారు. ఆయా స్థలాలు కబ్జా చేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. యువత ఉపాధికి అందించే సబ్సిడీ రుణాలు అటకెక్కించారు. బీసీల్లో ప్రతి కులానికి కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. బీసీల సంక్షేమ పథకాలన్నీ రద్దు బాటలోనే నడిచాయి. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు అడుగడుగునా అన్యాయం జరిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 30కిపైగా పథకాలను జగన్ సర్కారు రద్దుల పద్దులోకి చేర్చింది. బీసీలపై దాడులు పెరిగిపోతున్నా కనీస చర్యలు లేవు. ఒక్క కాకినాడ జిల్లాలోనే చూస్తే 7.40 లక్షల మందికి పైగా బీసీలు ఉన్నా ఒక్క ఎమ్మెల్యే సీటును బీసీలకు కేటాయించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 19.80 లక్షల మంది బీసీలు ఉన్నట్టు సమాచారం ఉంది.

బీసీలకు ఆదరణ ఎక్కడన్నా?

టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఆదరణ పథకం చేతివృత్తుల వారికి అండగా ఉండేది. ఈ పథకం కింద చేతివృత్తులు చేసుకునే వారికి 90 శాతం సబ్సిడీపై అత్యాధునిక పరికరాలు, పనిముట్లు అందించేవారు. ఈ పథకం కింద లక్షలాది మంది చేతివృత్తిదారులు లబ్ధిపొందారు. అయితే గత ఎన్నికల ముందు మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలకొచ్చిన ఈ ఉపకరణాలు పంపిణీ చేయకుండా వైసీపీ సర్కారు నిలిపివేయడంతో అవి తుప్పు పట్టిపోయాయి. అంతే కాకుండా అప్పటికే పెండింగ్‌లో ఉన్న లక్షల దరఖాస్తులను, చెల్లించిన డీడీలను పక్కన పడేసింది. కనీసం డీడీలు వెనక్కి ఇవ్వలేదు. బీసీలకు సంబంధించి 100 కిపైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకోవడం మినహా ఐదేళ్లూ ఒక్క పైసా జగన్ సర్కారు విడుదల చేయలేదు. బీసీ కార్పొరేషన్ల ద్వారా గతం నుంచి అమలవుతూ వచ్చిన అన్ని పథకాలను రద్దుచేసింది. యువతకు ఉపాధి కల్పించేందుకు 50 శాతం సబ్సిడీపై గరిష్ఠంగా రూ.25 లక్షల వరకూ రుణాలను గతంలో అందించేవారు. జగన్ వాటి ఊసే ఎత్తలేదు. గతంలో అమలుచేసిన ఓబీఎంఎంఎస్, ఎంబీసీ పథకాలను అటకెక్కించింది. బీసీ విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులకు ఎగనామం పెట్టారు. విదేశీ విద్య పథకాన్ని నీరుగార్చింది. టీడీపీ ప్రభుత్వం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీసీ భవన్లు,బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించేది. వీటికి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలను కేటాయించింది. నిర్మాణాలు ప్రారంభించి సగంలో ఉన్న భవనాల పనులు నిలిపివేసింది. అప్పటికే కేటాయించిన నిధులను రద్దుచేశారు. అంతటితో ఆగని వైసీపీ నేతలు బీసీ భవన్‌లు, కమ్యూనిటీహాళ్లకు కేటాయించిన విలువైన స్థలాలపై కన్నువేసి కబ్జా చేశారు. పిఠాపురంలో ఇటువంటి ప్రయత్నమే జరగగా బీసీ నాయకులు, టీడీపీ నేతలు అడ్డుకున్నారు. రజకుల కోసం చేపట్టిన దోబీ ఘాట్ల నిర్మాణాలు నిలిపివేశారు. టీడీపీ హయాంలో బీసీల్లోని అన్ని వర్గాలకు 30కిపైగా సంక్షేమ పథకాలు అమలుచేయగా వైసీపీ ప్రభుత్వం వీటన్నింటిని రద్దుచేసింది. జగనన్న చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పి దానిలోనూ ఆంక్షలు విధించి లబ్ధిదారుల సంఖ్యలో కోతలు పెట్టింది.ఈ ఒక్క పథకం మినహా బీసీల కోసం ఏ ఇతర పథకాలు అమలు చేయకపోవడం, బీసీలపై దాడులు జరుగుతున్నా నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు గురైంది. ఐదేళ్ల జగన్ ఏలుబడిలో బీసీలకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆయా వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

బీసీల స్థానిక రిజర్వేషన్లు కట్..కట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నా.. ఎస్సీలు, నా... బీసీలు, నా.. మైనార్టీలు.. నా ఎస్టీలు అంటూ దీర్ఘాలు తీసే వైసీపీ అధినేత, సీఎం జగన్ స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగకుండా కుట్ర చేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీలకు మరీ అన్యాయం చేశారు. స్థానిక సంస్థల్లోనే కాదు.. చట్ట సభల్లో కూడా రిజర్వేషన్లు కావాలని పోరాడుతున్న బీసీలకు, ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లు తగ్గించేయడంతో బీసీల ప్రాతినిధ్యం తగ్గిపోయింది. టీడీపీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది. అప్పుడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చైర్మన్లు, మేయర్లు ఎక్కువ మంది బీసీలే ఉండేవారు. నూటికి మూడో వంతు రిజర్వేషన్లతో పాటు జనరల్ స్థానాల్లో కూడా బీసీలు గెలవడంతో స్థానిక సంస్థల్లో బీసీల బలమే ఎక్కువగా ఉండేది. కానీ వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్ల తగ్గించే కుట్ర జరిగింది. తర్వాత కోర్టు కూడా 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదని చెప్పడం ఈ కుట్రదారులకు అనుకూల పరిస్థితి ఏర్పడింది. దీంతో 2019లో వైసీపీ గెలిచిన తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు బాగా తగ్గిపోయాయి. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. ఏకంగా 10 శాతం తగ్గిపోవడంతో స్థానిక సంస్థలో పట్టుసాధిస్తున్న బీసీలంతా కుప్పకూలిపోయారు. 2014 తర్వాత టీడీపీ 34 శాతం రిజర్వేషన్లు అమలుచేసింది. తర్వాత ఇబ్బందులు రావడంతో వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకెళ్లి, వీటిని అమలుచేయడానికి ప్రయత్నిస్తే మేలు జరిగేది. కానీ అసలు పట్టించుకోకపోవడంతో బీసీలు, మహిళలు అనేక అవకాశాలను కోల్పోయారు. టీడీపీ ఈసారి 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని చెబుతోంది. అంతేకాక బీసీ చట్టం కూడా తీసుకుని వచ్చి, బీసీలకు రక్షణగా ఉండే ఏర్పాటు చేయడానికి కూడా మేనిఫెస్టోలో పెట్టింది.

- 30 బీసీ పథకాలు రద్దు
- కొండెక్కిన ఆదరణ
- ఉత్తుత్తి కార్పొరేషన్లు
- సబ్సిడీల్లేవ్.. సాయం లేదు
- రిజర్వేషన్లు కుదింపు
- బీసీ భవన్‌లు లేవు..

'నేతన్న నేస్తం' పేరుతో.. చేనేత పథకాలన్నీ రద్దు

అమలాపురం రూరల్ : చేనేత కార్మికులకు లబ్ధి చేకూర్చేలా గతంలో త్రిఫ్ట్ ఫండ్ స్కీమ్ అమల్లో ఉండేది. కార్మికుడు ఆదాయంలో 8 శాతం జమ చేసుకుంటే ప్రభుత్వం 16 శాతం నగదు ఏడాదికోసారి కార్మికుడికి తిరిగిచ్చేవారు. ఆ మొత్తాన్ని చంద్రబాబు పాలనలో 18 శాతానికి పెంచారు. పవర్‌లూమ్‌ధాటికి చేనేత వస్త్రాలు తట్టుకునే విధంగా 20 శాతం రిబేటు విధానం గత ప్రభుత్వాలు కొనసాగిస్తే చంద్రబాబు 30 శాతం రిబేటు ప్రకటించారు. రాయితీని జగన్ ప్రభుత్వం ఎత్తివేసింది. చిలప నూలు కొనుగోలుపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం రాయితీ ఇస్తే చంద్రబాబు ప్రభుత్వం దాన్ని 30 శాతానికి పెంచింది. తద్వారా 15 శాతం కార్మికుడికి లబ్ధి చేకూరితే మరో 15 శాతం సంఘాలకు లబ్ధి కలిగేది. సిల్కు, పట్టు నూళ్లపై సైతం రాయితీలను ఎత్తివేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. పావలా వడ్డీ రాయితీని జగన్ రద్దు చేశారు. చేనేతలకు హెల్త్ ఇన్సూరెన్స్‌తో రూ.15 వేలు వరకు లబ్ధి చేకూర్చేవారు. ఇప్పుడా పథకం లేదు. కార్మికులు 58 ఏళ్లలోపు చనిపోతే రూ.60 వేలు అందించేవారు. నేడు ఆ పథకాలన్నీ రద్దయ్యాయి. దేవాంగ సాధికార సమితి ఐటీడీపీ కో-ఆర్డినేటర్ కొండా సత్యనారాయణరాజు మాట్లాడుతూ 'నేతన్న నేస్తం' పేరుతో గత ప్రభుత్వాలు అమలుచేసిన అన్ని సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో నేతనేసే కార్మికుల సంఖ్య సైతం గణనీయంగా తగ్గిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న నగదు పరపతి సొమ్ములకు వడ్డీలు చెల్లించలేక మూతపడే పరిస్థితి తలెత్తుతుంది.

16,860 పదవులు కోల్పోయాం..



జగన్ బీసీల రిజర్వేషన్లు 34 నుంచి 24 శాతం తగ్గించడంతో స్థానిక సంస్థల్లో 16,860 పదవులు కోల్పోయాం. టీడీపీలో బీసీ కార్పొరేషన్ నిధులిచ్చారు. ఆదరణ పథకం పెట్టారు. వైసీపీలో వీటి జాడే లేదు.
- బత్తుల నాగేశ్వరరావు(నాగు), రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, దివాన్‌చెరువు

ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం



వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్లు ప్రకటించి పాలకవర్గాలను నియమించింది. లోన్లు వస్తాయని మాకు మేలు జరుగుతోందని ఆశించాం. ఐదేళ్లు గడిచినా బీసీలకు ఏ ప్రయోజనం చేకూరలేదు. నమ్మించి వంచించిన జగన్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం.
- మామిడి లలిత, గృహిణి, ఏలేశ్వరం

మినీ ఫిషింగ్ హార్బరు గాలికి..



టీడీపీ అంతర్వేదిలో రూ.33 కోట్లతో మినీ ఫిషింగ్ హార్బరు నిర్మాణం చేపట్టారు. రూ.20 కోట్లు మంజూరు చేసి సగం నిర్మించారు. మిగిలిన ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రభుత్వం మత్స్యకారుల జీవన భృతికి తూట్లు పొడిచింది. **- తిరుమాని ఆచార్యులు, రాష్ట్ర మత్స్యకార సాధికార అధ్యక్షుడు, అంతర్వేది**



రాజమహేంద్రవరం లోక్‌సభకు నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థిని పురందేశ్వరి



రాజమహేంద్రవరం రూరల్‌కు నామినేషన్ దాఖలు చేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

భలే మంచిరోజు..

రెండో రోజు భారీగా అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో రెండో రోజు శుక్రవారం.. ఏకాదశి.. కావడంతో అసెంబ్లీ స్థానాలకు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో రెండు రోజుల్లో మొత్తం 18 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థినిగా దగ్గుబాటి పురందేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనపర్తి నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా నల్లమిల్లి మహాలక్ష్మి, కొవ్వూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వేంకటేశ్వరరావు, నిడదవోలు నుంచి జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇక వైసీపీ నుంచి రాజానగరం అభ్యర్థిగా జక్కంపూడి రాజా ఇంద్రవందిత్, గంధం రాజేశ్వరి, గోపాలపురం వైసీపీ అభ్యర్థినిగా మంత్రి తానేటి వనిత, జొన్నకూటి బాబాజీరావు నామినేషన్లు దాఖలు చేశారు. కొవ్వూరు కాంగ్రెస్ అభ్యర్థినిగా అరిగెల అరుణకుమారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొంత శ్యామ్ రవిప్రకాష్, నిడదవోలు నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) అభ్యర్థిగా కస్తూరి సత్యప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు.

కోనసీమలో 10..

అమలాపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన రెండో రోజు శుక్రవారం అసెంబ్లీ స్థానాలకు పది మంది నామినేషన్లు దాఖలుచేశారు. అమలాపురం లోక్‌సభకు రెండో రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వివిధ పార్టీల నుంచి పది మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అమలాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆర్డీవో కార్యాలయంలో రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో బీఎస్పీ నుంచి మాతా సుబ్రహ్మణ్యం ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జిత్తుక వెంకట్రావు ఒక సెట్ నామినేషన్లు వేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నుంచి పొన్నాడ నీరజ ఒక సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పాలెపు ధర్మారావు, సత్తిరాజు ఎస్‌వీయూవీఆర్ఎస్ స్వామి స్వతంత్ర అభ్యర్థిగా, బీర రాజకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మండపేట నుంచి నందికోళ్ల రాజు, నవతరం పార్టీ నుంచి మందపల్లి రవి స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు.

కాకినాడ జిల్లాలో...

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్19: కాకినాడ జిల్లాలో శుక్రవారం మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. కాకినాడ లోక్‌సభకు రెండు నామినేషన్లు వేశారు.ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన చందక అనూష భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) తరపున కాకినాడ లోక్‌సభకు నామినేషన్ దాఖలు చేశారు. గిడ్ల సింహాచలం కాకినాడ లోక్‌సభకు ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. వీరిద్దరూ నామినేషన్లను జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు అందజేశారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. తుని నియోజకవర్గానికి లాలం లోవరాజు ఇండిపెండెంట్‌గా, ప్రత్తిపాడు నుంచి వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ రూరల్ నుంచి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), కాకినాడ సిటీ నుంచి వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట నుంచి జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) కూటమి అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇక మిగిలిన పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఇదిలా ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థినిగా మిరియాల శిరీషాదేవి నామినేషన్ దాఖలు చేశారు.



నిడదవోలు కూటమి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కందుల దుర్గేష్



కొవ్వూరు కూటమి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు



జగన్ కదిలితేనే కదలండి : ఎస్టీ రాజాపురం వద్ద ప్రయాణికుల అడ్డగింత

పిఠాపురంలో ట్రాఫిక్ జామ్

నరకయాతన

- సీఎం జగన్ రోడ్ షో.. జనానికి చుక్కలు
- కాకినాడ సభకు భారీగా ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల ఇక్కట్లు
- జగన్ రోడ్ షో.. జనాన్ని మండుటెండలో నిలిపేసిన పోలీసులు
- కాకినాడలో 'మేమంతా సిద్ధం' సభ
- మధ్యలోనే వెళ్లిపోయిన జనం
- పిఠాపురంలో బస్ లోపల్నుంచే అభివాదం

రాజమహేంద్రవరం/సర్పవరంజంక్షన్/పిఠాపురం/గొల్లప్రోలు/ప్రత్తిపాడు/కొత్తపల్లి/ఏలేశ్వరం, ఏప్రిల్19: సీఎం జగన్ రోడ్ షో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులకు నరకయాతనగా మారింది. కాకినాడ రూరల్ అచ్చంపేట వద్ద జరిగిన మేమంతా సిద్ధం సభకు భారీగా ఆర్టీసీ బస్సుల కేటాయించారు. దీంతో డిపోల్లో బస్సులు లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు యాత్ర దారిలో ప్రజలను ఎక్కడికక్కడ మండుటెండలో నిలిపివేశారు. పెద్దాపురం ఏడీబీ రహదారిపైకి రాకుండా బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు, ఆస్పత్రులకు వెళ్లేవారు సతమతమయ్యారు. జగన్ బస్సు యాత్ర రెండో రోజు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలోని బస కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు జగన్ బస్సులో బయలుదేరారు. యథావిధిగా నోరు విప్పకుండా ఏసీ బస్సులోంచి నమస్కారం పెడుతూ వెళ్లిపోయారు. జగన్ వస్తే జనాలకు తిప్పలు తప్పవనే నానుడి మరోసారి రుజువైంది. ముందస్తు సమాచారం లేకుండా ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్‌ని ఇష్టానుసారం ఎక్కడికక్కడ నిలిపి వేయడంతో జనం ఎండలో అల్లాడిపోయారు. రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వెళుతున్న ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను సీఎం బసకు కొద్దిదూరంలో రాజానగరం జంక్షను వద్ద బస్సుల్లోంచి దింపేశారు. వారి ఎక్కి వచ్చిన ఆర్టీసీ బస్సులను అక్కడే నిలిపివేశారు. తమకు సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయని కనీసం ఒక్క బస్సునైనా అనుమతించాలని విద్యార్థులు పోలీసుల కాళ్లావేళ్లాపడ్డా కనికరించలేదు. దీంతో సుమారు 50మంది ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎండలో రోడ్డుపై, తాటిచెట్ల కింద నిలబడి వాహనాల కోసం ఒత్తిడి పడుతూ ఎదురుచూశారు. అటు కాకినాడ రూరల్ నియోజకవర్గానికి 300 ఆర్టీసీ బస్సులు, సిటీకి 150 బస్సులు సమకూర్చినా, బస్సులో సీఎం సభకు వచ్చేందుకు ప్రజలు నిరాసక్తత ప్రదర్శించడంతో నాయకులు ఖంగుతిన్నారు. ఫలితంగా సగానికి పైగా ఆర్టీసీ బస్సులు ఖాళీగానే కాకినాడ సిటీ, రూరల్, కరప మండలాల నుంచి అచ్చంపేట సెంటర్‌కు రావడం విశేషం. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడిన తర్వాత ప్రజలను ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించిన వెంటనే కార్యకర్తలు, మహిళలు సభా ప్రాంగణం నుంచి బయటకువెళ్లిపోవడం మొదలుపెట్టారు. దీంతో ఖంగుతిన్న నాయకులు సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లకుండా చూడాలంటూ పోలీసులను అభ్యర్థించడంతో కొద్దిసేపు పోలీసులు ప్రజలను నిలువరించినా, వీరి మాటలను పట్టించుకోకుండా బారికేడ్లు దాటుకుని మరీ బయటకు వెళ్లిపోవడం కనిపించింది.



మేం ఉండలేం నాయనో : కాకినాడ సిద్ధం సభ నుంచి మధ్యలోనే వెళ్లిపోతున్న జనం

80శాతంపైగా బస్సులు రద్దు

ఎన్నికలు వచ్చినా వైసీపీ అధికార దుర్వినియోగం ఆగడం లేదు. సీఎం జగన్ సిద్ధం సభకు ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు భారీగా వినియోగించారు. దీంతో ఆయా బస్టాపుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు, అనకాపల్లి, విశాఖపట్టణం జిల్లాల్లోని అన్ని డిపోలనుంచి ఆర్టీసీ బస్సులను తీసుకువచ్చారు. వీటికి అదనంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డిపోల ఆర్టీసీ బస్సులను సిద్ధం సభ కోసం కేటాయించారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, పిఠాపురం సహా అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులను సభ కోసం కేటాయించడంతో కాకినాడ-కత్తిపూడి-తుని-సామర్లకోట రూట్‌లో తిరిగే బస్సుల్లో 80శాతంపైగా రద్దు చేశారు. దీనివల్ల ఆయా బస్టాపుల్లో ఉదయం నుంచి ప్రయాణికులకు పడిగాపులు తప్పలేదు. కళాశాలలు, పాఠశాలలుకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలు, వ్యాపారాలు నిమిత్తం వెళ్లే వారితోపాటు వివిధ వర్గాల ప్రజలు, మహిళలు బస్సులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.

బస్సుయాత్రలో ఆగని జగన్

పిఠాపురం/పిఠాపురం రూరల్, ఏప్రిల్ 19: కాకినాడ రూరల్ అచ్చంపేటలో 'మేమంతా సిద్ధం' సభ ముగిసిన తర్వాత సీఎం జగన్ బస్సు యాత్ర పిఠాపురం బైపాస్‌రోడ్డులో వెళ్లింది. జగన్ కోసం ఎదురుచూపులు చూసిన వారికి నిరాశే మిగిలింది. బస్సును ఆపకుండా లోపల నుంచే అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పిఠాపురం మండలం చిత్రాడలో సీఎం జగన్ బస్సుయాత్రకు జనం కరువయ్యారు. జగన్ శుక్రవారం సాయంత్రం వస్తున్నట్టు ప్రచారం చేసినా ఎవ్వరు రోడ్ల మీదకు రాలేదు. దీంతో పోలీసులు రోడ్లుకు ఇరువైపులా ఉన్న షాపులను మూయించకుండా వదిలివేశారు. జగన్ రాకతో ట్రాఫిక్ నిలిపివేత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్ రాక ముందు, వెళ్లిన తర్వాత గంటకు పైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు అందులో చిక్కుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టకపోవడంతో బైపాస్‌రోడ్డుకి ఇరువైపులా, పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వెళ్తున్న వారికి అనేక అగచాట్లు తప్పలేదు.



మీ మాటలు వినడానికి సిద్ధంగా లేం : కాకినాడలో జరిగిన మేమంతా సిద్ధం సభ నుంచి మధ్యలోనే వెళ్లిపోతున్న జనం



మీరు సిద్ధమే.. కానీ మేము.. : ఖాళీగా సిద్ధం సభకు వెళ్లే బస్ ఇలా

పెద్దాపురంలో రోడ్ షో వెలవెల

పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 19: మేమంతా సిద్ధం పేరుతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సీఎం జగన్‌కు పెద్దాపురం పట్టణంలో ప్రజలు గట్టి షాకిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం ఎస్టీ రాజాపురం నుంచి బయలుదేరిన సీఎం జగన్‌కు పెద్దాపురంలో స్వాగతం పలికేందుకు ఒక్కరూ కూడా రాలేదు. పెద్దాపురం పాండవుల మెట్ట జంక్షన్, వాలుతిమ్మాపురం జంక్షన్, ఆర్‌బీ పట్నం జంక్షన్‌లవద్ద జనాలు లేకపోవడంతో రోడ్ షో వెలవెలబోయింది. ఏడీబీ రహదారి పొడవునా బస్సు యాత్రకు జనం కరువయ్యారు. దీంతో రోడ్ షో చప్పగా సాగింది. జగన్ బస్సు యాత్ర కారణంగా ఉదయం 7 గంటల నుంచి ప్రజలు నరకయాతన అనుభవించారు. రాజమహేంద్రవరం వైపుగా వెళ్లే వాహనాలను పోలీసులు అనుమతించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఐదు గంటలపాటు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించాల్సి వచ్చింది. ఆస్పత్రికి వెళ్లే రోగులు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు అల్లాడిపోయారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కొవ్వూరు తరలిన కూటమి నాయకులు



కొవ్వూరు వెళ్తున్న కూటమి శ్రేణుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఆళ్ల హరిబాబు

చాగల్లు, ఏప్రిల్ 19: మండలం నుంచి టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కొవ్వూరు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు ప్రారంభించారు చాగల్లులో కూటమి శ్రేణులు బైక్‌లపై ఊరేగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్, అశోక్‌బాబా, గూడపాటి వెంకట్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ పాల్గొన్నారు. కరుటూరి సతీష్ ఆధ్వర్యంలో నెలటూరు నుంచి నందిగం శ్రీను, యడ్లపల్లి రకారావు, తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, తాళ్ళూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: టీడీపీ నాయకులు అన్నదేవరపేట నుంచి అల్లూరి విక్రమాదిత్య, తాళ్లపూడి నుంచి నామన పరమేశ్వరరావు, వేగేశ్వరపురం నుంచి కైగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు పార్టీల కార్యకర్తలు భారీగా కొవ్వూరు వెళ్లారు.

ప్రమాదాల నివారణకు కృషిచేయాలి

కొవ్వూరు, ఏప్రిల్ 19: వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి, శ్రీశివసాయి నర్సింగ్ హోంలో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహనా సదస్సులు నిర్వహించారు. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, మంటలను అదుపు చేయడంలో ఫైర్ ఎస్టింగ్విషర్స్ వినియోగంపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రిలోని డాక్టర్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పి.అప్పారావు, సీహెచ్.వీవీ గంగాధరరావు, ఎం.రవికుమార్, ఎన్.రామకృష్ణ, కె.ధనుంజయరావు, వై.రాంబాబు, ఎమ్.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

నిడదవోలులో చెక్‌పోస్టల తనిఖీ



ఆర్వో కార్యాలయంలో మాట్లాడుతున్న పరిశీలకుడు రోహిత్‌కుమార్

నిడదవోలు, ఏప్రిల్ 19: నియోజకవర్గంలోని పెరవలి, పాలంగ్రి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేసి రికార్డును పరిశీలించినట్టు వ్యయ పరిశీలకుడు రోహిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నిడదవోలులోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తరచు తిరిగే వాహనాలపై నిఘా పెట్టాలన్నారు. రిటర్నింగ్ అధికారి ఆర్వీ రమణ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు బి.శ్రీనివాస్, లైజెన్ ఆఫీసర్ కె.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ఫారం-12 సేకరణ కేంద్రం

తాళ్ళపూడి, ఏప్రిల్ 19 సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది నుంచి పోస్టల్ బ్యాలెట్ ఫారం-12 దరఖాస్తుల సేకరణ కేంద్రాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఫారం-12 సమర్పించే వారు ఎలక్షన్ డ్యూటీ ఆర్డరు కాపీ, ఆధార్ ఓటరు ఐడీ జిరాక్సు కాపీలు, 2 పాస్‌పోర్టుసైజు ఫొటోలను తహశీల్దార్ కార్యాలయం తహశీల్దార్ లేదా డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేయాలని పేర్కొన్నారు.

వడదెబ్బ నుంచి రక్షణకు జాగ్రత్తలు



కోరుమామిడిలో వేసవిలో జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ ఆంద్రూ

నిడదవోలు, ఏప్రిల్ 19: వేసవిలో బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ అరికట్టి వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చునని తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.ఆంద్రూ అన్నారు. శుక్రవారం నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు, ప్రజలకు వేసవిలో రక్షణ చర్యలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశాలత, కె.దేవదాస్, ఎస్.ఎమేలియమ్మ, పి.రత్నం పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ తయారు చేయాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి జోసెఫ్ దానియేల్

తాళ్ళపూడి, ఏప్రిల్ 19: హోం ఓటింగ్‌కు సెక్టార్ అధికారులు సర్వేయర్ల సహాయంతో రూట్ మ్యాప్ తయారు చేసి అందించాలని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ నోడల్ అధికారి జోసెఫ్ దానియేల్ చెప్పారు. తాళ్లపూడి సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్‌లెవెల్ అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, 85 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటు ఇస్తున్నందున వారు మే 2న ఇంటి వద్దే ఉండి ఓటును వేయాలని, ఓటు వేసేందుకు తగిన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకొని సజావుగా ఎన్నికల ప్రక్రియ సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిడదవోలు తరలిన నాయకులు

పెరవలి, ఏప్రిల్ 19: కూటమి నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు వెళ్లారు. కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, అజ్జరం, నల్లాకులవారిపాలెం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో వెళ్లారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



పెరవలిలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

పెరవలి, ఏప్రిల్ 19: కూటమి అభ్యర్థులకు మద్దతుగా టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తున్నారు. పెరవలిలో ఇంటింటికీ తిరుగుతూ రాబోయే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు వివరిస్తూ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో నాయకులు, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, పసలపూడి భద్రయ్య,ఎంపీటీసీ రాపాక ప్రమీల, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి నాగేశ్వరరావు, సలాది శ్రీహరి, పిప్పర రవి పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చులపై పూర్తిస్థాయి నిఘా

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19: జిల్లాలో జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చులపై పూర్తిస్థాయిలో నిఘా ఉందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఆమె ఎన్నికల ఖర్చుల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల ఖర్చుల పరిశీలకులు రోహిత్ నగర్, నితిన్ కురాయిన్, జై అరింద్, రాజమహేంద్రవరం ఆర్వో కె.దినేష్‌కుమార్, రూరల్ ఆర్వో ఎన్.తేజ్‌భరత్‌లు హాజరయ్యారు. ఎన్నికల ఖర్చులపై క్షేత్రసాయి పరిశీలనలు, రికార్డుల నిర్వహణ, నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా చేపడుతున్న కార్యకలాపాలపై సమీక్షలు, ఎన్నికల కమిషన్ నియమావళి, మార్గదర్శకాలు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఇకపై చేసే ఖర్చులు నామినేషన్ దాఖ చేసిన అభ్యర్థుల ఖాతా కింద నమోదు అవుతాయని చెప్పారు. అలాగే ఎన్నికల ఖర్చుల విభాగం కలెక్టరేట్, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ కార్యాయంలో కూడా ఇదే సమావేశాన్ని ఆర్వో, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ నిర్వహించారు.

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం

» నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు

» ఆర్వో కార్యాలయాల వద్ద కోలాహలం



ఆర్వోకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న వనిత

కొవ్వూరు, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి ఘట్టమైన నామినేషన్ల కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఈ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. శుక్రవారం పలు పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

కూటమి కొవ్వూరు అభ్యర్థిగా ముప్పిడి

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా ఆయన ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డసుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో మెరకవీధి వినాయకుని గుడి, కనకదుర్గమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్, విజయవిహార్ సెంటర్ మీదుగా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్న ముప్పిడి నామినేషన్ దాఖలు చేశారు.

లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా బొంతా శ్యాం

కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొవ్వూరుకు చెందిన బొంతా శ్యాం రవిప్రకాష్ నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా శ్యాం రవిప్రకాష్ మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, పర్యాటకంగా తీర్చిదిద్దుతానని, రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని, బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. అవినీతి రహిత కొవ్వూరుగా తయారుచేసి ప్రజాస్వామ్యాన్ని బతికిస్తానన్నారు. రిజర్వుడు నియోజకవర్గంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులను పట్టించుకునే మంత్రి గాని, ఎమ్మెల్యే గాని లేరని, దళితుల సమస్యలు పట్టించుకునే నాయకులు లేరన్నారు. స్థానికుడిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

వైసీపీ గోపాలపురం అభ్యర్థిగా వనిత

గోపాలపురం, ఏప్రిల్ 19: వైసీపీ గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి తానేటి వనిత తన నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఎల్ శివజ్యోతికి సమర్పించారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆమె తండ్రి జొన్నకూటి బాబాజీరావు తన నామినేషన్ పత్రాన్ని సమర్పించినట్టు ఆర్వో ఓ ప్రకటనలో తెలిపారు.

కూటమి నిడదవోలు అభ్యర్థిగా దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 19: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్ శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్వీ రమణ నాయక్‌కు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన నాయకుడు భోగవల్లి ప్రసాద్, బీజేపీ నాయకుడు బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నిడదవోలు అభ్యర్థిగా సత్యప్రసాద్

నిడదవోలు, ఏప్రిల్ 19: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన కస్తూరి సత్యప్రసాద్ నిడదవోలులోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో ఆర్వీ రమణనాయక్‌కు నామినేషన్ దాఖలు చేశారు.

కందుల దుర్గేష్‌కు మాతృ వియోగం



మేడా పద్మావతి (ఫైల్‌ఫొటో)



పద్మావతి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శేషారావు

రాజమహేంద్రవరం అర్బన్/నిడదవోలు, ఏప్రిల్ 19: జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ మాతృమూర్తి మేడా పద్మావతి(88) శుక్రవారం రాజమహేంద్రవరంలో మృతిచెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దుర్గేష్ శుక్రవారం నిడదవోలులో ఎన్నికల నామినేషన్ దాఖలు చేశారు. నిడదవోలు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేసే హడావిడిలో ఉన్న దుర్గేష్‌కు మాతృమూర్తి మృతివార్త తీవ్రంగా కలచివేసింది. నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని ఆయన హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకున్నారు. పలువురు తెలుగుదేశం, జనసేన, ఇతర పార్టీల నాయకులు పద్మావతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కాగా, కొద్దిరోజుల క్రితమే దుర్గేష్ సతీమణి మృతి చెందారు. దుర్గేష్ మాతృమూర్తి మృతిపట్ల జనసేన పార్టీ సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ సంతాపం తెలిపారు. అలాగే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల టీడీపీ నాయకులు పద్మావతి మృతదేహానికి నివాళులర్పించారు.

పాత సోమాలమ్మకు పురందేశ్వరి పూజలు



తాడిపర్రు సర్పంచ్ బీజేపీలో చేరిక

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 19: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గు బాటి పురందేశ్వరి శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా శ్యామలానగర్‌లోని గ్రామదేవత, పాత సోమా లమ్మ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

బీజేపీలో పలువురు చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19: ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు తన అనుచరులైన నియోజకవర్గంలోని పలు మండలాల వైసీపీ నాయకులు సుమారు 30 మందితో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో వీరంతా బీజేపీ కండువా కప్పుకున్నారు. విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రాజేష్ వర్మ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఉండ్రాజవరం, ఏప్రిల్ 19: తాడిపర్రు సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కరుటూరి నరేంద్రబాబు శుక్రవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు కూటమి రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేంద్రబాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి సర్పంచ్‌గా గెలిపొందారు. అప్పటి నుంచి పార్టీలకతీతంగా తటస్థంగా ఉన్నారు. ప్రస్తుతం ప్రధాని మోదీ విధానాలకు ఆకర్షితులై తన అనుచర వర్గంతో బీజేపీలో చేరినట్టు చెప్పారు. దేశంలో మోదీ మరోసారి విజయం సాధిస్తారని, ఏపీలో కూటమి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గోపాలపురం, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతిచెందింది. మండలంలోని వాదాలకుంట గ్రామంలో గ్యాస్ లీకేజీ కారణంగా చెలరేగిన మంటల్లో చిక్కుకున్న గాయపడ్డ నామాల నిర్మల (35)ను చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి గురువారం తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం 6గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

ధవళేశ్వరం ఏప్రిల్ 19: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో అందంగా అలంకరించిన భారీ వేదికపై అశేష భక్తజనం మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆశీనులుచేసి ఊరేగించారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని పూలమాలలో అలకరించారు.

కొవ్వూరు సమస్యలపై పదేళ్లుగా పోరాటం

» కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి రుద్రరాజు



కొవ్వూరులో నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 19: నిబద్ధత కలిగిన కార్యకర్తగా అరుణకుమారికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొవ్వూరు టిక్కెట్టు కేటాయించిందని, ఆమె పదేళ్లుగా నియోజకవర్గ సమస్యలపై పోరాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ జెండాను ప్రతి గ్రామానికి తీసుకెళ్తున్నారని ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరిగెల అరుణకుమారి శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీ అభ్యర్థి రుద్రరాజు ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల స్పందన బాగుందన్నారు. పార్టీ ప్రకటించిన 9 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. అరుణకుమారి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచించిన విధంగా మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. కాగా కొవ్వూరులోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు నామినేషన్ వేయడానికి ఆర్డీవో కార్యాలయానికి పాదయాత్రగా తరలివెళ్లారు. దారి పొడవునా రుద్రరాజుకు ప్రజానీకం అభివాదం చేస్తూ, వారికి కరచాలనం చేశారు. జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్ నినాదంతో కొవ్వూరు పట్టణం మారుమ్రోగింది. కార్యక్రమంలో రాజమహేంద్రవరం అర్బన్ అభ్యర్థి బోడ వెంకట్, అధికార ప్రతినిధులు కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, యూత్ కాంగ్రెస్ బిల్డర్ బాబి, కె.శ్రీనివాస్, శెట్టి ప్రతాప్, కొవ్వూరు పట్టణాధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాహుజి, గెడ్డం సాయిబాబా, పాలకుర్తి ప్రభాకర్, కొణిదల శ్రీనివాస్, అందే వెంకట నాగభూషణం, గుమ్మాపు జాన్, కొయ్యా వెంకట్రావు, ఎం.నాగాంజనేయులు, సీపీఎం నాయకులు సుందర బాబు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవంగా దుర్గేష్ నామినేషన్ ర్యాలీ



నిడదవోలులో జనసంద్రంగా మారిన జనసేన పార్టీ కార్యాలయం

నిడదవోలు, ఏప్రిల్ 19: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు పట్టణ పుర వీధులు జనసందంగా మారిపోయింది. దుర్గేష్ నామినేషన్ ర్యాలీ విజయోత్సవాన్ని తలపించేలా ఉంది. కోట సత్తెమ్మ ఆలయం సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్దకు అభిమానులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఇసుక వేస్తే రాలని పరిస్థితి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన నాయకుడు భోగవల్లి ప్రసాద్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, బీజేపీ నాయకుడు బండి సత్య నారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, జనసైనికులు, తెలుగు తమ్ముళ్లతో కలసి దుర్గేష్ నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లారు.

కొవ్వూరులో కూటమి గెలుపు ఖాయం

నామినేషన్ దాఖలు చేసిన ముప్పిడి వెంకటేశ్వరరావు



ర్యాలీలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు

కొవ్వూరు, ఏప్రిల్ 19: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నియోకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో కొవ్వూరు పట్టణమంతా జన సందోహంగా మారింది. జనసైనికులు చిరంజీవి, రామ్‌చరణ్, పవన్‌కల్యాణ్ చిత్రపటాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, అచ్చిబాబు ప్రజలకు అభివాదం చేస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థి గెలుపు వన్‌సైడ్‌గా ఉంటుందన్నారు. వైఎస్ జగన్ రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, బలహీనవర్గాలకు చెందిన వారిని అందర్ని ఒక్కచాన్స్ పేరుతో మోసగించి రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లాడని అన్నారు. అన్నివర్గాలు ఏకమై కూటమి అభ్యర్థులను గెలుపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, బీజేపీ నాయకుడు పరిమి రాధాకృష్ణ, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, నామన పరమేష్, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఎంపీపీ కాకార్ల నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కూటీ

» ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

» మద్యం మత్తులో ఘటన





ప్రమాదంలో గాయాల పాలైన యువకులు, ధ్వంసమైన స్కూటీ

నల్లజర్ల, ఏప్రిల్ 19: హోం మంత్రి, వైసీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ముగ్గురు యువకులు మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల గ్రామానికి చెందిన కలపాల గణేశ్, బొన్నూరి పండు, కలపాల సాగర్ ఒకే స్కూటీపై శుక్రవారం ఉదయం వైసీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత నామినేషన్ ప్రక్రియలో పాల్గొనేందుకు గోపాలపురం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అనంతపల్లి టోల్ ప్లాజా వద్ద అతి వేగంగా వచ్చి ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్నారు. స్కూటీ రెండు భాగాలైంది. ముగ్గురు యువకులు తీవ్ర గాయాల య్యాయి. వారిని హైవే అంబులెన్స్ గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. మద్యం మత్తు కారణంగా ప్రమాదం జరిగినట్టు స్థానికులు భావిస్తున్నారు.

36 పేజీల వివాహ శుభలేఖ



రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 19: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు, ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ అమ్మ ఒడి సేవా తరంగిణి కార్యదర్శి శివస్వామి వివాహం సందర్భంగా ఆహ్వానించడానికి ప్రచురించిన 36 పేజీల వివాహ శుభలేఖ ఆహ్వానితులను ఆశ్చర్యపరచింది. శుక్రవారం ఉదయం కొవ్వూరు మెయిన్ రోడ్డులోని రాజ్యలక్ష్మిగోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవంలో ఈ 36 పేజీల శుభలేఖ శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆవిష్కరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఎలక్ట్రానిక్స్ సహాయాచార్యులు, శ్రీ అమ్మ ఒడి సేవా తరంగిణి అధ్యక్షుడు విజయదుర్గా కుమార్(విజయ్ స్వామి) మాట్లాడుతూ ఈ శుభలేఖ వివాహంలోని నిశ్చితార్థం మొదలుకొని 16 రోజులు పండుగ వరకు ఉన్న అన్ని ఘట్టాలను సూక్ష్మంగా వివరించామని, ఈ ఘట్టాల గురించి స్థూలంగా తెలుసుకోవాలన్న వారి కోసం ఆహ్వాన పత్రికలో ప్రతీ ఘట్టం వద్ద క్యూఆర్ కోడ్ లను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు తమ ఫోన్లలో గూగుల్ లెన్స్ ద్వారా గాని క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్కాన్ చేస్తే శ్రీ అష్ట అను యూట్యూబ్ చానెల్ ద్వారా ప్రవచన వీడియోలు ఫోన్లలో వీక్షించవచ్చని తెలిపారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ ప్రచారక్ సోముజీ మాట్లాడుతూ నేటి తరాలకు వివాహం ఎలా చేయాలన్న ప్రశ్నకి, సందేహాలకు, అవగాహనకు ఈ ఒక్క శుభలేఖ ఉంటే చాలని ఆనందాన్ని వ్యక్తపరిచారు.